గురువారం
28-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 98
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అణ్వస్త్రాలు నిర్మూలిద్దాం

అణ్వస్త్రాలను నిర్మూలిద్దాం, మానవాళి శాంతి కోసం కొత్త శకంలోకి అడుగు పెడతామని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. అణ్వస్త్రాలను పూర్తిగా నిర్మూలించడం ద్వారా ఒకప్పుడు అణ్వాయుధాలు ఉండేవట అన్న పరిస్థితిని తీసుకొచ్చి చరిత్ర లిఖిద్దామని సూచన చేశారు.

2 లో

విద్యుత్ భారాలపై ఆగ్రహం

- రాష్ట్రవ్యాప్తంగా దద్దరిల్లిన కలెక్టరేట్లు
- స్మార్ట్ మీటర్లపై వెనక్కి తగ్గాల్సిందే: రామకృష్ణ
- వైసీపీ, టీడీపీ వ్యతిరేకించాలి: శ్రీనివాసరావు

విశాలాంధ్ర- విజయవాడ:
పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాడతామని వామపక్ష పార్టీల నేతలు స్పష్టం చేశారు. విద్యుత్ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ, ప్రజాఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాలను నిరసిస్తూ 10 వామపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఆందోళనకు దిగాయి. అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేశాయి. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, పేదలపై అదనపు భారాలు మోపవద్దని నినదించాయి. పెంచిన చార్జీలు తగ్గించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశాయి. జగన్ ప్రభుత్వం స్మార్టు మీటర్లు ఏర్పాటు చేయడం ఆపాలని, విద్యుత్ సంస్కరణల బిల్లును వైసీపీ, టీడీపీ వ్యతిరేకించాలని డిమాండ్ చేశాయి. వామపక్షాల ఆందోళనలతో కలెక్టరేట్లు దద్దరిల్లాయి.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ లెనిన్‌సెంటర్‌లో భారీ ధర్నా జరిగింది. దీనికి సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలెవరూ అడగకపోయినా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు అడగకపోయినా విద్యుత్ సంస్కరణలను కేంద్రం చెప్పినట్లు అమలు చేయటానికి వైసీపీ ప్రభుత్వం సిద్ధపడటం దారుణమని విమర్శించారు. బీజేపీ

- మిగతా 2 లో

కాషాయం కక్కుతున్న విషం

- 2023లో ముస్లింలపై విద్వేష ప్రసంగాలు
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అత్యధికం

న్యూఢిల్లీ:
విద్వేషం... విధ్వంసం... ఇదీ కాషాయ బీజేపీ చేస్తున్న ప్రజా వినాశక చర్యలు. కేంద్రంలో, ఆ పార్టీ ఏలుతున్న రాష్ట్రాల్లోని పాలనా ఏమిటంటే మతోన్మాద దురంహకారాన్ని ప్రదర్శించడమే. దేశంలో మునుపెన్నడూ లేనివిధంగా బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర మతాలపై విద్వేష ప్రసంగాలు చేస్తూ ఆ పార్టీ నాయకులు విషం గక్కుతున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 2023లో 28 శాతం ముస్లిం వ్యతిరేక ప్రసంగాలు జరిగాయి. 2023 మొదటి ఆరు నెలల్లోనే 250కి పైగా డాక్యుమెంట్ చేయబడిన సమావేశాలు జరిగాయి. వీటిలో ముస్లిం వ్యతిరేక ద్వేషపూరిత ప్రసంగాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో జరగడం విశేషం. వీటిలో దాదాపు 70 శాతం 2023 లేదా 2024 శాసనసభ ఎన్నికలు ఉన్న రాష్ట్రాల్లో నివేదించబడ్డాయని ఒక అధ్యయనం కనుగొంది. ఆన్‌లైన్ హేట్ ట్రాకింగ్ పోర్టల్, హిందుత్వ వాచ్ కోసం రకీబ్ హమీద్ నాయక్, ఆరుషి శ్రీవాస్తవ, అభ్యుదయ త్యాగి రచించిన '2023 హాఫ్-ఇయర్లీ రిపోర్ట్ : యాంటీ-ముస్లిం హేట్ స్పీచ్ ఈవెంట్స్ ఇన్ ఇండియా' ఈ విషయాలను వెల్లడించింది. 2023 ప్రథమార్థంలో ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న 255 డాక్యుమెంట్ చేయబడిన ద్వేషపూరిత ప్రసంగ సమావేశాలలో 205 లేదా 80 శాతం బీజేపీ పాలిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో జరిగినట్లు నివేదిక కనుగొంది. మహారాష్ట్ర, కర్నాటక, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లో అత్యధిక సంఖ్యలో ద్వేషపూరిత ప్రసంగాల సమావేశాలు జరిగాయి. అలాంటి సంఘటనలు మహారాష్ట్రలోనే 29 శాతం ఉన్నాయని నివేదిక కనుగొంది. ఇది మహారాష్ట్రను 'ఒక దృష్టాంత సందర్భం' అని పేర్కొంది. ముస్లిం వ్యతిరేక ద్వేషపూరిత ప్రసంగాలను పెళుసైన ఎన్నికల మద్దతు ఉన్న ప్రాంతాలలో ప్రచారం చేయడానికి బీజేపీ ఆ రాష్ట్రంలో తన అధికారాన్ని ఎలా ఉపయోగించుకుంటుంది' అనే విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. రాష్ట్రంలోని పాలక మహా వికాస్ అఘాడి కూటమిలో చీలికకు బీజేపీ ఇంజినీరింగ్ పాత్రను నివేదిక పేర్కొంది. '2024లో రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్‌తో ముస్లిం వ్యతిరేక భావాలను వ్యాప్తి చేయడానికి ఉద్దేశపూర్వక ప్రయత్నం జరుగుతున్నట్లు కనిపిస్తోంది' అని వివరించింది. అత్యధిక ద్వేషపూరిత ప్రసంగాలు జరుగుతున్న మొదటి ఎనిమిది రాష్ట్రాల్లో ఏడు బీజేపీ, దాని సంకీర్ణ భాగస్వాములచే పాలనలో ఉన్నాయని పేర్కొంది. 2023 ప్రథమార్థంలో కర్నాటక (ఈ కాలంలో ఎక్కువ కాలం బీజేపీ పాలనలో), మధ్య ప్రదేశ్, గుజరాత్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలు 20 లేదా అంతకంటే ఎక్కువ విద్వేషపూరిత ప్రసంగ సమావేశాలను చూశాయి. దీనికి ఏకైక మినహాయింపు కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన రాజస్థాన్. ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్నాయని పేర్కొంది. ఇక ఉత్తరాఖండ్ పరిస్థితి 'ఆందోళనకరం' అని వెల్లడించింది. దేశం మొత్తం జనాభాలో 1 శాతం కంటే తక్కువ జనాభా రాష్ట్రం ఉన్నప్పటికీ, 2023 మొదటి అర్థ భాగంలో 5 శాతం ద్వేషపూరిత సంఘటనలు ఉత్తరాఖండ్‌లో సంభవించాయని వివరించింది. అటువంటి ద్వేషపూరిత ప్రసంగ సమావేశాలలో మూడవ వంతు అంటే 33 శాతం స్పష్టంగా ముస్లింలపై హింసకు పాల్పడాలని, 12 శాతం ఆయుధాలతో దాడులకు పాల్పడాలని పిలుపునిచ్చాయి. దాదాపు 11 శాతం సంఘటనలు ముస్లింలకు వ్యతిరేకంగా బహిష్కరణ పిలుపులను కలిగి ఉన్నాయి. ఇటువంటి సమావేశాలలో దాదాపు 4 శాతం ముస్లిం మహిళలను లక్ష్యంగా చేసుకుని ద్వేషపూరిత, లింగ వివక్షపూరిత ప్రసంగాలు స్పష్టంగా కలిగి ఉన్నాయని అధ్యయనం పేర్కొంది. ద్వేషపూరిత ప్రసంగాలు జరిగిన సమావేశాల వెనుక ఎవరున్నారో కూడా నివేదిక వెలుగులోకి తెచ్చింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దాదాపు 52 శాతం సమావేశాలు 'విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్, సకల్ హిందూ సమాజ్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్), బీజేపీ అనుబంధ సంస్థలచే నిర్వహించినవే. 15 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో 42 శాతం ద్వేషపూరిత ప్రసంగ సమావేశాలు ఆర్ఎస్ఎస్‌తో అనుబంధంగా ఉన్న సమూహాలు నిర్వహిస్తున్నాయని నివేదిక కనుగొంది. కుట్ర సిద్ధాంతాలు పెద్ద సంఖ్యలో ద్వేషపూరిత ప్రసంగాలకు దారితీశాయి. ఇతర

- మిగతా 2 లో

వచ్చే ఏడాది శుక్రయాన్!

వీనస్ మిషన్ కోసం పేలోడ్స్ సిద్ధం

ఇస్రో ఛైర్మన్ సోమనాథ్

న్యూఢిల్లీ:
చంద్రయాన్-3 విజయోత్సాహంతో ఆదిత్య మిషన్‌ను దిగ్విజయంగా సాగిస్తున్న భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) తదుపరి వీనస్‌పై అడుగు పెట్టాలని భావిస్తోంది. వీనస్ మిషన్ కోసం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ ప్రకటించారు. సౌర వ్యవస్థలో అత్యంత ప్రకాశవంతమైన గ్రహమైన వీనస్

- మిగతా 2 లో

భూ సిఫార్సులు అమలు చేయాల్సిందే

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభల్లో తీర్మానం
- బాపట్ల ముగిసిన మహాసభలు

విశాలాంధ్ర బ్యూరో- బాపట్ల:
పేదలు సాగుచేసుకునేందుకు ప్రభుత్వ భూముల పంపిణీతో పాటు కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులు అమలు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభల్లో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు మూడు రోజులపాటు బాపట్లలో దిగ్విజయంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన బుధవారం ప్రతినిధుల సభలో అనేక తీర్మాలను ప్రతినిధులు ఆమోదించారు. రాష్ట్రంలోని 26 జిల్లా నుంచి వచ్చిన ప్రతినిధులు వారి జిల్లాలో జరుగుతున్న సమస్యలను వివరించారు. గత నాలుగేళ్లుగా పేద వర్గాల కోసం చేసిన పోరాటాలతో పాటు భవిష్యత్తు కార్యాచరణను మహాసభలో చర్చించారు. ముందుగా రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత పేదలు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. 90 ఏళ్ల పోరాటంలో సాధించుకున్న భూ సంస్కరణ చట్టాలు నేటికీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బంజరు భూములు లక్షల ఎకరాలు ఉన్నప్పటికీ వాటిని భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు

- మిగతా 2 లో

జల్లి విల్సన్ | కోటేశ్వరరావు | ఆవుల శేఖర్ | వెంకట్రావు

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్

- గౌరవాధ్యక్షులుగా జల్లి విల్సన్
- డిప్యూటీ జనరల్ సెక్రటరీగా వెంకట్రావు

2 లో

ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

సెషన్ మొత్తం నోరుమెదపని సీఎం జగన్

చంద్రబాబును విమర్శించడమే లక్ష్యంగా సాగిన ప్రసంగాలు

పాత అంశాలపైనే మళ్లీ లఘు చర్చలు

ఐదు కీలక బిల్లుల ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు బుధవారం ముగిశాయి. తొలి రెండు రోజులు ప్రతిపక్ష సభ్యులు సభకు హాజరు కాగా, మిగిలిన మూడు రోజులు స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ, తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ సమావేశాలను బహిష్కరించారు. దీంతో శాసనసభ సమావేశాలు ఏకపక్షంగా సాగాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తడం, ప్రతిపక్ష నేత చంద్రబాబును ఇష్టారాజ్యంగా తూలనాడుతూ విమర్శలు గుప్పిస్తూ సమావేశాలు కొనసాగాయి. పాత అంశాలైన అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ అంశాలనే మళ్లీ లఘు చర్చలుగా అజెండాలో చేర్చి, వాటిల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు పెద్దఎత్తున స్కాంకు పాల్పడినట్లు సభలో మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు దుమ్మెత్తిపోశారు. ఈనెల 21న సమావేశాలు ప్రారంభం కాగా, 23, 24 తేదీలు సెలవులు కావడంతో మొత్తం 5 రోజుల పాటు సమావేశాలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చంద్రబాబుకు దక్కని ఊరట

సుప్రీంలో అక్టోబరు 3, ఏసీబీ కోర్టులో 4వ తేదీకి విచారణ వాయిదా

మరో వారం తప్పని ఎదురుచూపులు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
స్కిల్ స్కామ్‌లో రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబుకి బుధవారం కూడా ఏ కోర్టులోనూ ఉపశమనం లభించలేదు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వేసిన క్వాష్ పిటీషన్‌పై అక్టోబరు 3వ తేదీకి విచారణ వాయిదా పడగా, విజయవాడ ఏసీబీ కోర్టులో బెయిల్ పిటీషన్ కూడా అక్టోబరు 4వ తేదీకి విచారణ వాయిదా పడింది. దీంతో చంద్రబాబుకి మరో వారం రోజులు ఎదురుచూపులు తప్పని పరిస్థితి ఏర్పడింది. సుప్రీంకోర్టులో ఈ వ్యవహారం తేలే వరకూ విజయవాడ ఏసీబీ కోర్టు బెయిల్‌పై నిర్ణయం తీసుకునేందుకు మొగ్గు చూపడం లేదు. స్కిల్ స్కాం కేసులో ఓవైపు చంద్రబాబు బెయిల్ కోరుతుండగా... మరోవైపు సీఐడీ అధికారులు మరో ఐదు రోజుల కస్టడీ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు పిటిషన్లపై బుధవారం విచారణ చేపట్టినప్పటికీ విజయవాడ ఏసీబీ కోర్టు ఏ నిర్ణయం

- మిగతా 2 లో

డిసెంబరు 4 నుంచి సమ్మెబాట

ఉద్యోగుల ఔట్‌సోర్సింగ్, ప్రైవేటీకరణపై బ్యాంకులవారీ పోరాటాలు: ఏఐబీఈఏ

చెన్నై:
ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థను నీరుగార్చి దానిని ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) పిలుపునిచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సిబ్బంది కొరత నివారణకు సముచిత నియామకాలు జరపాలని డిమాండ్

- మిగతా 2 లో

మళ్లీ మోదీ ప్రధానైతే...

దేశంలో చీలికే...

- ఎన్నికల లబ్ధి కోసమే మహిళా బిల్లు
- ఇండియా కూటమితో బీజేపీ పతనం
- సీపీఐ కార్యదర్శి నారాయణ

2 లో

దేశ ప్రధానిగా మళ్లీ నరేంద్ర మోదీ అయితే, ఈ దేశం రెండుగా చీలడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. మోదీ పొరపాటున గెలిస్తే దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మళ్లీ మోదీ ప్రధానైతే...

దేశంలో చీలికే...

విశాలాంధ్ర బ్యూరో-చెన్నై: దేశ ప్రధానిగా మళ్లీ నరేంద్ర మోదీ అయితే, ఈ దేశం రెండుగా చీలడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. మోదీ పొరపాటున గెలిస్తే దేశంలో లౌకిక, ప్రజాస్వామ్యం కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెన్నైలో బుధవారం ఆయన విలేకరులతో జాతీయ, రాష్ట్ర అంశాలపై మాట్లాడారు. మణిపూర్‌లో తాజాగా ఇద్దరిని కిడ్నాప్ చేసి చంపేశారని, నిరంతరం అక్కడ హింసాత్మక ఘటనలు కొనసాగుతుంటే, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే మణిపూర్ వెళ్లాలని, అక్కడి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి ఒక ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. బీజేపీ డబుల్ ఇంజన్ విధానంతో కేంద్రంతోపాటు రాష్ట్రాల్లోనూ ఆ పార్టీనే ఆధిపత్యం చెలాయించాలనే దిశగా ప్రయత్నిస్తోందన్నారు.

ఇండియా కుటమి ఏర్పాటుతో మోదీ, బీజేపీ పతనం ప్రారంభమైందని అన్నారు. ఇండియా కూటమికి పోటీగా అనేక రాజకీయ పార్టీలతో బీజేపీ అధ్వర్యంలో ఎన్డీఏ కూటమి సమావేశం నిర్వహించినప్పటికీ, ఫలితం లేదన్నారు. అందులో 17 రాజకీయ పార్టీలకు చిరునామానే లేదని ఎద్దేవా చేశారు. క్రమేపీ ఎన్డీఏ కూటమి నుంచి ఒక్కొక్కరూ వైదొలుగుతున్నారని వివరించారు. దీనిని తెలుగు రాష్ట్రాల్లోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు. తెలుగు రాష్ట్రాల పాలకులు మాత్రం ఇంకా బీజేపీతో జత కట్టడాన్ని ఆయన తప్పుపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వల్ల దేశానికి ఎలాంటి మేలు జరగడం లేదన్నారు. ప్రధానంగా తెలుగు ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. అలాంటి మోదీ ప్రభుత్వంతో ఏపీ సీఎం వైఎస్ జగన్ జతకట్టడం దారుణమన్నారు. తెలుగువాళ్లు కేంద్రంలో పెద్ద పదవులను చేపట్టినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌కు ఏమీ చేయలేకపోయారన్నారు. భారత ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రమణ పనిచేసినా రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మహిళా బిల్లుకు తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రతిపక్షాలు మద్దతు ఇచ్చాయంటూ, ఆ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అసలు బీజేపీ ప్రభుత్వమే తప్పనిసరి పరిస్థితుల్లో, ఎన్నికల కార్యాచరణలో భాగంగా ఈ మహిళా బిల్లును ప్రవేశపెట్టిందని, ఆ బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వాస్తవంగా మహిళా బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే దానిని అమలు చేయవచ్చు కదా? అని నారాయణ సూటిగా ప్రశ్నించారు.

ఓట్ల కోసమే తెరపైకి 'సనాతన ధర్మం': ఒకవైపు ఆర్థిక భారం, మరోవైపు కార్పొరేట్ల దోపిడీ దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటన్నిటినీ పక్కదోవ పట్టించేందుకు బీజేపీ తాజాగా సనాతన ధర్మం పేరుతో ముందుకు వస్తోందని నారాయణ ఎద్దేవా చేశారు. హిందూవులకు, సనాతన ధర్మానికీ ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం ఓట్ల కోసమే దీనిని తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. మోదీ అధికారంలోకి వచ్చాక విభజన చట్టాల అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా నుంచి విభజన హామీల అమలును పూర్తిగా విస్మరించారని గుర్తుచేశారు. అలాంటి మోదీతో కేసీఆర్, జగన్ జతకట్టడం విచారకరమన్నారు. కేవలం లిక్కర్ కేసుల్లో కేసీఆర్ కుమార్తె కవిత, జగన్‌కు చెందిన మనుషులు ఉన్నందునే మోదీతో రాజీ పడుతున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చాక, 10 ఏళ్ల పాటు బెయిల్ పై ఉన్న వ్యక్తి జగన్ ఒక్కరేనని వ్యాఖ్యానించారు. అలాంటి జగన్ బెయిలుపై బయట ఉండి, టీడీపీ అధినేత చంద్రబాబును జైలుకు పంపారన్నారు.

చంద్రబాబును అరెస్ట్ చేసిన విధానం సరి కాదని చెప్పారు. అవినీతి ఆరోపణలు ఉంటే విచారణ చేయవచ్చని వ్యాఖ్యానించారు. మోదీ, అమిత్ షా ప్రమేయం లేకుండా చంద్రబాబు అరెస్టు అసాధ్యమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ బలపడేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు, అందులో భాగంగానే మొదటగా ప్రతిపక్ష టీడీపీని అంతం చేసి, ఆ తర్వాత అధికార వైసీపీని అణచి వేయవచ్చనే వ్యూహంతో ఉందన్నారు. ఇవన్నీ తెలిసి కూడా కేంద్రంలో బీజేపీకి కేసీఆర్, జగన్ మద్దతిస్తున్నారని నారాయణ ఆగ్రహ వ్యక్తం చేశారు. వారి బాటలోనే టీడీపీ ఉండటం తగదని సూచించారు.

అణ్వస్త్రాలు నిర్మూలిద్దాం

మానవాళి శాంతి శకంలోకి అడుగు పెడదాం: గుటెర్రస్

ఐరాస: అణ్వస్త్రాలను నిర్మూలిద్దాం, మానవాళి శాంతి కోసం కొత్త శకంలోకి అడుగు పెడతామని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. అణ్వస్త్రాలను పూర్తిగా నిర్మూలించడం ద్వారా ఒకప్పుడు అణ్వాయుధాలు ఉండేవట అన్న పరిస్థితిని తీసుకొచ్చి చరిత్ర లిఖిద్దామని సూచన చేశారు. అంతర్జాతీయ అణ్వాయుధాల సంపూర్ణ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిపిన ఐరాస ఉన్నతస్థాయి ప్లీనరీలో గుటెర్రస్ మాట్లాడుతూ అణ్వాయుధాలు చరిత్రలో మిగిలిపోవాలని ప్రపంచ దేశాలకు స్పష్టంచేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అణ్వస్త్రాలు వినియోగించమన్న ప్రతిజ్ఞకు కట్టుబడాలని సూచించారు. 'వాస్తవ పరిస్థితులను మనకు మనమే గుర్తుచేసుకోవాలి. అణ్వస్త్రాల కట్టడికి నిర్మూలన ఒక్కటే మార్గమని గ్రహించాలి' అని అన్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా అణ్వాయుధాలు వినియోగిస్తే మానవతా విపత్తు తప్పబోదని హెచ్చరించారు. 'కొత్తగా ఆయుధ పోటీ మొదలైంది. ఇది ఆందోళ కలిగిస్తోంది. అణ్వస్త్రాల సంఖ్య పెరుగుతోంది. అనేక దశాబ్దాల్లో ఇలాంటి పరిస్థితి రావడం ఇదే మొదటిసారి. అణ్వాయుధాల వినియోగాన్ని, పరీక్షల కట్టడి కోసం తెచ్చిన నిబంధనలు, చేసిన ప్రతిజ్ఞలు, ఒప్పందాలు మరుగున పడుతున్నాయి. అంతర్జాతీయ నిరాయుధీకరణ, అణ్వాయుధాలు పెరగకుండా రూపొందించిన కార్యాచరణ సరిగ్గా అమలు కావడం లేదు. అణు ఆయుధశాలల ఆధునీకీకరణ జరుగుతూ మరింత వేగంగా అస్త్రాలు సిద్ధమవుతున్నాయి. మరింత కచ్చితత్వంతో లక్ష్యాన్ని నాశనం చేసే సామర్థ్యంతో అణ్వాయుధాలు రూపుదిద్దుకుంటున్నాయి' అని గుటెర్రస్ అన్నారు. అణునిరాయుధీకరణ బాధ్యతలకు, ఎలాంటి పరిస్థితుల్లోనూ అణ్వస్త్రాలు వాడబోమన్న సంకల్పానికి కట్టుబడాలని అణ్వాయుధ దేశాలకు పిలుపునిచ్చారు. అణు నిరాయుధీకరణకు పునరంకితం కావాలన్నారు. నాన్-ప్రొలిఫిరేషన్ ట్రీటీకి కట్టుబడాలని సూచించారు. అణు ముప్పు అంతానికి, ఉద్రిక్తతల తొలగింపునకు చర్చలు, దౌత్యమే మార్గమన్నారు. అణ్వస్త్రాల వినియోగానికి సంబంధించి ఎలాంటి నిర్ణయమైనా మనుషులే తీసుకోవాలని, వాటి పూర్తి నియంత్రణ మానవుల చేతుల్లో ఉండాలని, కృత్రిమ మేధస్సు, ఇతర సాంకేతికతలపై ఆధారం తగదని గుటెర్రస్ హితవు పలికారు. 'ప్రపంచం దీర్ఘకాలంగా అణ్వస్త్రాల నీడలో ఉంది. విపత్తు అంచు నుంచి అడుగు వెనక్కి వేస్తూ మానవాళి శాంతి కోసం కొత్త శకంలోకి ప్రవేశిద్దాం. అణ్వస్త్రాలను గతంగా మారుస్తూ చరిత్ర లిఖిద్దాం' అని ప్రపంచ దేశాలకు ఐరాస ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు.

డిసెంబరు 4 నుంచి సమ్మెబాట

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. రెగ్యులర్ ఉద్యోగుల ఔట్‌సోర్సింగ్‌కు జరుగుతున్న ప్రయత్నాలను ఆక్షేపించింది. 'బ్యాంకుల్లో సరిపడ స్థాయిలో నియామకాలు లేవు. రిటైర్మెంట్లు, పదోన్నతులు, మరణాలు తదితర కారణాలతో ఏర్పడే ఖాళీలను భర్తీ కావడం లేదు. పని ఒత్తిడిని తగ్గించేలా అదనపు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. 50కోట్లకుపైగా జన్‌ధన్ యోజన ఖాతాలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉండటంతో శాఖలపై పనిఒత్తిడి పెరిగింది. సిబ్బంది కొరతతో వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందక వారి నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. క్లర్కులు, కింది స్థాయి కేడర్‌ను తగ్గించి పర్యవేక్షణ సిబ్బందిని పెంచడం ద్వారా పారిశ్రామిక వివాదాల చట్టం పరిధిలో ఉండే వర్కర్లు ఎక్కువగా ఉండరాదన్నదే ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాల ఉద్దేశమని స్పష్టమవుతోంది. రెగ్యులర్ ఉద్యోగుల ఔట్‌సోర్సింగ్ ద్వారా ద్వైపాక్షిక ఒప్పందం కింద వేతనాలు చెల్లింపులను నివారించాలని చూస్తున్నారు. అందుకే క్లర్క్ పోస్టులు భర్తీ చేయడంలేదు. సబార్డినేట్ స్టాఫ్, సఫాయి కర్మచారీల నియామకాలపై వర్చువల్‌గా నిషేధముంది. సరైన వేతనాలు లేకుండా తాత్కాలికంగా అధిక సంఖ్యలో నియామకాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల పరిష్కారం కోసం దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సమ్మె బాట పట్టక తప్పడంలేదు. ఈ ఏడాది డిసెంబరు నుంచి వచ్చే ఏడాది జనవరి చివరి వరకు దశలవారీగా ఆందోళనలు జరగనున్నాయి. 2024 జనవరి 19, 20వ తేదీల్లో అఖిభారత బ్యాంకుల సమ్మె జరుగుతుంది. అలాగే జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో సమ్మెలు జరుగుతాయి. ఈ ఏడాది డిసెంబరు 4 నుంచి 11వ తేదీ వరకు బ్యాంకుల వారీగా ఆందోళనలు జరుగుతాయని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రకటించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులను బలహీన పర్చి ప్రైవేటు రంగ బ్యాంకింగ్‌కు ఊతమివ్వాలని, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటుపరం చేయాలన్న కుట్రలు జరుగుతున్నాయని పేర్కొంది. తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టాలని అఖిలభారత ఉద్యోగుల సమాఖ్య నిర్ణయించినట్లు తెలిపింది. దశలవారీ పోరాటాలతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలుగుతుందని, తమ పోరాటానికి మద్దతివ్వాలని ఖాతాదారులకు, దేశ ప్రజలను ఏఐబీఈఏ కోరింది.

పోరాటాలు ఇలా:

డిసెంబరు 4	-	పీఎన్‌బీ, సిండ్ బ్యాంక్, ఎస్‌బీఐ దేశవ్యాప్త సమ్మె
డిసెంబరు 5	-	బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా సమ్మె
డిసెంబరు 6	-	కెనడా బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమ్మె
డిసెంబరు 7	-	ఇండియన్ బ్యాంక్, యూసీఓ బ్యాంకు సమ్మె
డిసెంబరు 8	-	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సమ్మె
డిసెంబరు 11	-	అన్ని ప్రైవేటు బ్యాంకుల అఖిభారత సమ్మె
జనవరి 2	-	తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, పుదుచ్చేరి,అండమాన్ & నికోబార్, లక్షద్వీప్‌లోని అన్ని బ్యాంకుల ఉద్యోగుల ఆందోళన
జనవరి 3	-	గుజరాత్, మహారాష్ట్ర, గోవా, దాదర్, దామన్-డయ్యూ బ్యాంకు ఉద్యోగుల సమ్మె
జనవరి 4	-	ఢిల్లీ, పంజాబ్, హరియాణా, జమ్ముకశ్మీర్, లఢక్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని అన్ని బ్యాంకుల ఉద్యోగుల సమ్మె
జనవరి 6	-	పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్, జార్ఖండ్, అసోం, త్రిపుర, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం బ్యాంకు ఉద్యోగుల ఆందోళన
జనవరి 19, 20	-	అన్ని బ్యాంకుల రెండురోజుల అఖిలభారత సమ్మె

ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

జరిగాయి. ఈసారి విచిత్రమేమిటంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతి రోజూ సమావేశాలకు హాజరైనప్పటికీ, ఏ ఒక్కరోజు కూడా ఆయన సభలో మాట్లాడకపోవడం విశేషం. అయితే అధికారపక్ష సభ్యులు మాత్రం ఆయన సమక్షంలోనే ప్రతిపక్ష నేత చంద్రబాబును తూర్పారబట్టారు. ఇక ఈ సమావేశాల్లో ఆంధ్ర ప్రదేశ్ గ్యారెంట్ పెన్షన్ సిస్టమ్ బిల్లు-2023, సివిల్ కోర్టు అమెండ్‌మెంట్ బిల్లు, గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ సెకండ్ అమెండ్‌మెంట్ బిల్లు,ఏపీ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ఆఫ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ బిల్లు-2023, ద్రవ్య వినిమయ బిల్లు-3 ఆమోదం పొందాయి.

పెళ్లి వేడుకలో విషాదం

114 మంది దుర్మరణం - 200 మందికి గాయాలు

బాగ్దాద్: పెళ్లి వేడుకలో విషాదం చోటుచేసుకుంది. వివాహం కోసం ముస్తాబైన మండపంలో మంటలు ఎగిసిపడ్డాయి. 114 మంది దుర్మరణం చెందగా 200 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటన ఉత్తర ఇరాక్‌లోని నైవే ప్రావిన్స్‌లోగల అల్ హందానియా పట్టణంలోగల ఫంక్షన్ హాల్‌లో జరిగినట్లు ఇరాకీ సివిల్ డిఫెన్స్ వెల్లడించినట్లు ఇరాకీ వార్తాసంస్థ (ఐఎన్ఏ) నివేదించింది. బాణాసంచా పేల్చిన క్రమంలో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ప్రాథమిక నివేదికలు తెలిపాయి. ఒక్కసారిగా చెలరేగిన మంటలు అంతా చూస్తుండగా భవనం మొత్తం వ్యాపించాయి. వివాహం కోసం అందంగా ముస్తాబైన భవనాన్ని బుగ్గి చేశాయి. భవనంలోని ఓ భాగం కుప్పకూలినట్లు ఐఎన్ఏ వెల్లడించింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపింది. ఈ విషాదంపై ఆరోగ్యశాఖ అధికార ప్రతినిధి సైఫ్ అల్ బదర్ స్పందించారు. మంటలు అదుపు చేశారని, అంతా నియంత్రణలోనే ఉందని, ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నామని చెప్పారు.

భూ సిఫార్సులు అమలు చేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

మీనమేషాలు లెక్కిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఉన్న భూములను గుర్తించి ఎర్రజెండా పార్టీ వాటిని పేదలకు పంపిణీ చేసేందుకు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దున్నేవాడికి భూమి అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. గ్రామాల్లో సామాజిక న్యాయం, వెట్టిచాకిరి నుంచి విముక్తి, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు తీసుకురాక పోగా ఉన్న చట్టాలను నీరుకారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వరంగ సంస్థలను కూడా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే పోర్టులు, విమానయానం, జీవితబీమా, తపాలా, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెపుతున్నారని తెలిపారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు నినాదంతో 30 మంది బలిదానం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును పరిశ్రమలను అదానీకి అప్పజెప్పేందుకు కుట్రలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూములను పేదలకు పంపిణీ చేసే ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. జగనన్న కాలనీలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు గ్రామాల్లో ఉన్న పరిస్థితులకు ఎక్కడ పొంతనలేదన్నారు. ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు గృహాన్ని నిర్మించే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ బంజరు భూములను పంపిణీ చేసే వరకు పోరాడాలని ప్రతినిధులకు సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలు, కూలీలు చేతివృత్తులదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. మహాసబ ఆమోదించిన తీర్మానాల అమలుకు భవిష్యత్‌లో రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

బీకేఎంయు జాతీయ ఉపాధ్యక్షులు రామమూర్తి మహాసభల ముగింపు ఉపన్యాసం చేస్తూ నవంబర్ 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పాట్నాలో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. భూ పంపిణీ దేశవ్యాప్తంగా జరగాలన్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ గ్రామీణాభివృద్ధిని విస్మరించారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల విధానాలతో దేశం ప్రమాదం అంచున ఉందన్నారు.

ఇప్పటికే లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం అప్పులు చేసిందని పేర్కొన్నారు. దేశంలో సహజ సంపదను అదానీ, అంబానీ, టాటాలాంటి వారికి దోచిపెడుతున్నారని ఆవేదని వ్యక్తం చేశారు. గ్రామాల్లో పేదలకు ఉపాధి కోసం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయటం లేదన్నారు. పని కావాలని అడిగిన వెంటనే పని కల్పించే విధంగా ఈ చట్టని రూపొందిస్తే దీనికి కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించి తూట్లు పొడుస్తున్నదన్నారు.

బడ్జెట్లో కూడా నిధులు కేటాయింపు సక్రమంగా జరగటం లేదన్నారు. మరో పక్క పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి దిల్లీ వరకు ఉద్యమాలను ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్

విశాలాంధ్ర బ్యూరో- బాపట్ల: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలలో నూతన నాయకత్వం ఎన్నికైంది. 115 మందితో రాష్ట్ర కౌన్సిల్‌ను, 35 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని, 15 మంది ఆఫీస్ బెరర్లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ గౌరవాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షునిగా సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఆవుల శేఖర్ ఎన్నికయ్యారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ప్రకాశం జిల్లా కొత్తపట్నం ఎంపీటీసీ ఆర్.వెంకట్రావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్ ప్రభాకర్, బండి వెంకటేశ్వరరావు, టి.కిష్టప్ప, ఆర్.విజయ, టి.మధు, కార్యదర్శులుగా బి.కేశవరెడ్డి, సీహెచ్ వెంకటేశ్వరరావు, సుబ్రమణ్యం, కాబోతు ఈశ్వరరావు, లండా వెంకట్రావు, కోశాధికారిగా రామానాయుడు ఎన్నికయ్యారు.

చంద్రబాబుకు దక్కని ఊరట

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోలేకపోయింది. దీనికి ప్రధాన కారణం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న చంద్రబాబు క్వాష్ పిటిషనే. ఈ వ్యవహారం తేలకుండా తాము బెయిల్ లేదా కస్టడీ ఇస్తే ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన ఏసీబీ కోర్టు తమ నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఇక సుప్రీంకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై బుధవారం వాదనలు సాగుతాయని భావించినప్పటికీ, ధర్మాసనంలో జడ్జి ఎస్వీఎన్ భట్టి నాట్ బిఫోర్ మీ కోరడంతో ఈ వ్యవహారం సీజే బెంచ్‌కు చేరింది. దీనిపై చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ప్రత్యేక విజ్ఞప్తులతో విచారణ చేపట్టినప్పటికీ సీజే బెంచ్ ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇంకా చెప్పాలంటే చంద్రబాబుకు బెయిల్ కోరుతున్నారా అంటే లూథ్రా లేదని తేల్చిచెప్పేశారు. అసలు ఈ కేసే చెల్లదని వాదించారు. దీంతో తదుపరి విచారణను వరుస సెలవుల కారణంగా అక్టోబర్ 3కు వాయిదా వేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో విజయవాడ ఏసీబీ కోర్టు కూడా చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లపై విచారణను అక్టోబర్ 4కు వాయిదా వేసింది.

ఐఆర్ఆర్ కేసులో ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో రేపు విచారణ

అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ఈ నెల 29వ తేదీకి వాయిదా పడింది. ఈ బెయిల్ పిటీషన్‌పై చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వర్చువల్‌గా వాదనలు వినిపించారు. సీఐడీ తరపున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు. రాజధాని నగరానికి సంబంధించిన బృహత్ ప్రణాళిక డిజైనింగ్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, దాన్ని అనుసంధానించే రహదారుల ఎలైన్‌మెంట్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 2022 ఏప్రిల్ 27న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గత ఏడాది మే 9న సీఐడీ చంద్రబాబుతో పాటు, మరికొందరిపై కేసు నమోదు చేసింది.

చంద్రబాబును మొదటి నిందితుడిగా పేర్కొంది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిలు మంజూరు చేయాలని చంద్రబాబు పిటిషన్ వేయగా, రాజకీయ కారణాలతోనే ఈ కేసు నమోదు చేశారని ఆయన తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టుకి వివరించారు.

విద్యుత్ భారాలపై ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో ఉన్న రాష్ట్రాల కంటే ముందుగానే ఏపీలో తాను అమలు చేస్తానని సీఎం జగన్ చెప్పటం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మోదీ సర్కారు నిర్ణయాలను నిస్సిగ్గుగా అమలు చేస్తోందని మండిపడ్డారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు పేరుతో భారీ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. అదానీతో లాలూచీపడి, కమీషన్‌లకు కక్కుర్తిపడి బినామీ కంపెనీల పేరుతో డబ్బులు దోచుకుంటున్నారన్నారు. స్మార్ట్‌మీటర్ల ధర చండీగఢ్‌లో రూ.7,100, మధ్యప్రదేశ్‌లో రూ.7,900 ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో రూ.32 వేలు ఉందన్నారు. తన బినామీ సంస్థ అయిన కడపకు చెందిన షిర్డిసాయి కంపెనీ ద్వారా టెండర్లు వేయిస్తున్నారని తెలిపారు. తాను అధికారంలోకి వస్తే 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తానని హామీ ఇచ్చిన జగన్...అధికారంలోకి వచ్చిన తరువాత ఏడుసార్లు కరెంటు చార్జీలు పెంచి... రూ.50 వేల కోట్ల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపడ్డారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెరిగిన విద్యుత్ చార్జీల అంశాన్ని గ్రామస్థాయికి తీసుకెళతామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఏపీ కోసం జగన్' అని తనకు తానే ప్రచారం చేసుకుంటున్నారని, జగన్ అవసరమని ప్రజలెవరూ చెప్పటం లేదన్నారు. సీఎం జగన్ విధానాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలు తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలనే డిమాండ్‌తో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున చేపట్టే ఉద్యమంలో ప్రజలు, ప్రజాసంఘాలు, విద్యుత్ వినియోగదారుల సంఘాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి, పేదలకు యూనిట్ ఒక్క రూపాయికి, చిన్న పరిశ్రమలకు యూనిట్ 2.50 రూపాయలకి ఇవ్వటానికి ఈ ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్ల కొనుగోలులో వేలకోట్ల రూపాయల భారీ అవినీతి జరిగిందని, దీనిపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం పార్లమెంట్‌లో కేంద్రం ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణల బిల్లును వైసీపీ, టీడీపీ ఎంపీలు వ్యతిరేకించాలని కోరారు. విద్యుత్ సంస్కరణల బిల్లుపై అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ...తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సాంకేతికత పెరిగితే చార్జీలు తగ్గాలిగాని, విద్యుత్ విషయంలో చార్జీలు ఎందుకు పెరుగుతున్నాయని సందేహం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారులకు షాక్ ఇస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు దిమ్మతిరిగే సమాధానం ఇస్తారన్నారు. ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి కె.పోలారి, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం మోయలేని భారాలు: రాఘవులు, జగదీశ్

నెల్లూరులో వామపక్షాలు ఆందోళనకు దిగాయి. వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు తొలుత స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ అదనపు సర్దుబాటు చార్జీల పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని విమర్శించారు. వ్యవసాయానికి, 200 యూనిట్లు లోపు వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ మాట్లాడుతూ చెత్తపన్ను, ఇంటిపన్ను, విద్యుత్ చార్జీల పేరుతో వైసీపీ ప్రభుత్వం పేదలను దోచుకుంటున్నదని మండిపడ్డారు. ధర్నాలో సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీల జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విజయనగరంలో: విజయనగరం కలెక్టరేట్ వద్ద వామపక్షాలు ధర్నా చేపట్టాయి. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని నినదించాయి. విద్యుత్ సంస్కరణల బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ, సీపీఎం జిల్లా నాయకులు రెడ్డి శంకర్రావు సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు బెహరా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో:

చిత్తూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎ.రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని విమర్శించారు. మరో బషీర్‌బాగ్ ఉద్యమానికి ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు అధ్యక్షతన జరిగిన ధర్నాలో రామానాయుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోనని జగన్ హామీ ఇచ్చారని, అధికారం చేపట్టిన తర్వాత ఎడాపెడా భారాలు మోపారని నిందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి టి.జనార్దన్, స్థానిక సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది శుక్రయాన్!

(మొదటిపేజీ తరువాయి)

(శుక్రుడు) కోసం భారత్ సిద్ధమైందని, ఈ మిషన్‌కు సంబంధించిన పేలోడ్‌ను ఇప్పటికే అభివృద్ధి చేశామని అన్నారు. వీనస్ మిషన్‌కి ఇంకా పేరు పెట్టలేదు కానీ దీనిని 'శుక్రయాన్'గా పిలుస్తారని, వచ్చే ఏడాదిలో ఈ మిషన్‌ను ఇస్రో చేపట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా, దిల్లీలోని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీలో సోమనాథ్ మాట్లాడుతూ 'చాలా ప్రాజెక్టులు పరిశీలన దశలో ఉన్నాయి. వీనస్ మిషన్ ప్రణాళిక సిద్ధమైంది. ఇప్పటికే పేలోడ్స్ అభివృద్ధి జరిగింది. ఆసక్తికరమైన వీనస్ గ్రహాన్ని అన్వేషించడం ద్వార అంతరిక్ష శాస్త్ర రంగంలో కొన్ని ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి' అని తెలిపారు. వీనస్ వాతావరణ పీడనం భూమి కంటే 100 రెట్లు ఎక్కువన్నారు. ఈ గ్రహం యాసిడ్‌తో నిండి ఉంటుందని, ఉపరితలంపై ఎవరూ ప్రవేశించలేరని చెప్పారు. శుక్రుడి ఉపరితలం గట్టిగా ఉందో లేదో తెలియదని సోమనాథ్ తెలిపారు. ఒకప్పుడు భూమి కూడా శుక్రుడులాగే ఉండొచ్చన్న సందేహాన్ని వ్యక్తంచేశారు. 10వేల ఏళ్ల తర్వాత భూమి తన లక్షణాలను మార్చుకునే అవకాశం ఉందన్నారు. భూమి చాలాకాలం క్రితం నివాసయోగ్యమైన ప్రదేశం కాదన్నారు.

వైఫల్యమే గెలుపుకు సోపానం... ఇదే ఇస్రో విజయ రహస్యం

వైఫల్యమే గెలుపుకు సోపానమని, ఇదే ఇస్రో విజయ రహస్యమని సోమనాథ్ అన్నారు. ఇస్రోలో జరిగే తప్పులకు నిందించడం జరగదని చెప్పారు. నిర్భయాత్మకంగా ముందుకెళ్లేందుకు అవసరమైన ప్రోత్సాహం శాస్త్రవేత్తలకు లభిస్తుందన్నారు. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) 50వ వార్షికోత్సవం సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ తాను అనేకమార్లు విఫలమైనట్లు గుర్తుచేసుకున్నారు. అయితే ఎన్నడూ సీనియర్ల నుంచి విమర్శలు ఎదుర్కోలేదని చెప్పారు. వైఫల్యానికి ఒక వ్యక్తికి ఆపాదించే సంస్కృతి ఇస్రోకు లేదని, జరిగే ప్రతి నిర్ణయం సమ్మిళితంగా ఉంటుందని తెలిపారు. ఒక వ్యక్తికి అన్ని అంశాలు అర్థం కావని, కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకోవాలన్న స్పష్టమైన అవగాహన అంతరిక్ష రంగంలో ఉందని సోమనాథ్ చెప్పారు. సమ్మిళిత నిర్ణయం అంటే వైఫల్యానికి మీరు కూడా బాధ్యులే. అయితే యాజమాన్యం బాధ్యత తీసుకుంటుంది అని ఆయన వివరించారు. ఇలాంటి పద్ధతి లేకపోవతే ఎవ్వరూ ధైర్యంగా పరిశోధనల్లో ముందుకెళ్లబోరని ఆయనన్నారు. పేదరికంలో నుంచి వచ్చిన వారు విజయం కోసం పరితపిస్తారని, దానికి పునరంకితమై పనిచేస్తారని, అదే ఉన్నత సంస్థల నుంచి వచ్చిన వారికి పని విషయంలో అంత నిబద్ధత ఉండదని తన అనుభవం చెబుతోందని సోమనాథ్ తెలిపారు.

కాషాయం కక్కుతున్న విషం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాల కంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఎక్కువ. బీజేపీ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో దాదాపు మూడింట రెండు వంతులు లేదా దాదాపు 64 శాతం సంఘటనలు హిందుత్వ ప్రేరేపిత ముస్లిం వ్యతిరేక కుట్ర సిద్ధాంతాల సూచనలను పొందుపరిచాయి. మొత్తంమీద, 15 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో జరిగిన ద్వేషపూరిత ప్రసంగ సమావేశాలలో 51 శాతం ముస్లిం వ్యతిరేక కుట్ర సిద్ధాంతాలను కలిగి ఉన్నాయి. 2023లో రాష్ట్ర శాసనసభ ఎన్నికలను ఇప్పటికే నిర్వహించిన లేదా నిర్వహించబోతున్న రాష్ట్రాల్లో 33 శాతం ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలు జరిగాయి. అంతేకాకుండా, వీటిలో 36 శాతానికి పైగా 2024లో శాసనసభ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలు. మొత్తంగా, ఈ సంఘటనల్లో దాదాపు 70 శాతం 2023 లేదా 2024లో శాసనసభ ఎన్నికలు ఉన్న రాష్ట్రాల్లో నివేదించబడ్డాయి' అని నివేదిక కనుగొంది. అయితే ఎన్నికలు ఒక్కటే ఉత్ప్రేరకం కాదు. ముఖ్యమైనది రామ నవమి వంటి హిందూ పండుగలు, ద్వేషపూరిత సంఘటనలు, అలాగే ద్వేషపూరిత ప్రసంగాలు పెరిగాయని నివేదిక పేర్కొంది. 'మార్చి చివరి వారంలో పండుగకు ముందు, ఆ సమయంలో దేశవ్యాప్తంగా 18 ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలు జరిగాయి. ఈ నిర్దిష్ట రోజున హింసను ప్రేరేపించడానికి సాధ్యమైన సమన్వయ ప్రయత్నాన్ని సూచిస్తూ... ఈ ప్రయత్నాలు దురదృష్టవశాత్తు విజయవంతమయ్యాయి. ఫలితంగా కనీసం ఆరు రాష్ట్రాల్లో హింస చెలరేగింది' అని వివరించింది.

న్యాయవాదులకు రక్షణ, సంక్షేమ చట్టాలు అమలు చేయాలి

ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రంలో న్యాయవాదుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, ఉన్న చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదని, సరైన రక్షణ కరువైందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చలసాని అజయ్ కుమార్ అన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం న్యాయవాదులు కొద్దిసేపు తమ విధులను బహిష్కరించి సివిల్ కోర్టుల సముదాయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్ల కార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమ నిధి కింద ఇవ్వాల్సిన రూ.75 కోట్ల బకాయిలు విడుదల చేయాలని, సంక్షేమ నిధిని రూ.12 లక్షలకు పెంచాలని, మరణించిన వారి కుటుంబాలకు చెల్లించవలసిన పెండింగ్ మ్యాచింగ్ గ్రాంట్ రూ.30 కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.బి.సుందర్ మాట్లాడుతూ నగరంలో ఆధునిక భవనాలు అయితే పూర్తి చేశారోగానీ, అందులో విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేశ్వరరావు, కె.సుధాకర్ రాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.షరీఫ్, ప్రతినిధులు ఎన్.సాయి శంకర్, ఈఎన్ ప్రసాద్, పి.గిరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత రక్షణకు ఐక్య ఉద్యమాలు

జేవీ సత్యనారాయణమూర్తి పిలుపు

విశాలాంధ్ర-పెడన: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యమైన చేనేత రంగాన్ని కాపాడుకోవడం కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక సర్వోదయ చేనేత సొసైటీ భవనంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశం బుధవారం జరిగింది. తొలుత పుచ్చల సత్యనారాయణ చిత్రపటానికి పుష్పాలంకరణతో ఘననివాళి అర్పించారు. అనంతరం జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేనేత రంగంపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించడమంటే... చేనేత పరిశ్రమ పట్ల మోదీకి గల చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. రానున్న ఎన్నికల లోపు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం జిల్లా మహాసభలు, రాష్ట్ర మహాసభ నిర్వహించి సంఘాన్ని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నేతన్న నేస్తం పథకాన్ని నేత కార్మికులందరికీ వర్తింప చేయకపోవడం శోచనీయమని విమర్శించారు. పథకాలు, రాయితీలు, సబ్సిడీలు రద్దుచేసి సర్వరోగ నివారిణిలా ఒక్క నేతన్న నేస్తం పథకం మాత్రమే అమలు చేయటం సమంజసం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు నూలు, సబ్సిడీ థ్రిఫ్ట్ ఫండ్, పావలా వడ్డీ రాకపోవడంతో లక్షలాది రూపాయలు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. సహకార సంఘాల రుణాలు రద్దుచేసి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, కడుపు కన్నయ్య, ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, చేనేత నాయకుడు నాలూరి లక్ష్మయ్య, బుగుడే మాధవస్వామి, బిందెర ఓబయ్య(కడప, కృష్ణాజిల్లా చేనేత విభాగం ఇన్‌చార్జ్ అడ్డాడ ప్రసాద్, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోదాటి నారాయణరావు, జిల్లా కార్యదర్శి బూసం బాలసుబ్రమణ్యం, సీపీఐ పెడన నియోజకవర్గ కార్యదర్శి పేరిశెట్టి ఉమాకాంతరావు, రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన చేనేత ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరుకూరి వీరయ్య సేవలు మరువలేనివి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ ఇంజినీర్ చెరుకూరి వీరయ్య మరణం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో వీరయ్య మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి పారుదల రంగంలో ఇంజినీర్‌గా కీలకపాత్ర పోషించి, అందరి మన్ననలు పొందారని తెలిపారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీశైలం కుడి కాలువ, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి, బలిమెల డ్యామ్, మాచికండ్ జల విద్యుత్ కేంద్రంతో సహా అనేక ప్రాజెక్టుల నిర్వహణలో వివిధ స్థాయిల్లో ఇంజనీర్‌గా వీరయ్య వివిధ బాధ్యతలు సమర్థంగా నిర్వహించారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ నీటి హక్కుల కోసం, కృష్ణా, గోదావరి నదీజలాల వినియోగానికి సంబంధించి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రముఖ ఇంజినీర్ డాక్టర్ కే శ్రీరామకృష్ణయ్య పేరుతో స్మారక సేవా సమితిని ఏర్పాటు చేసి వీరయ్య అనేక పుస్తకాలను ప్రచురించారని పేర్కొన్నారు. చెరుకూరి వీరయ్య మరణంపట్ల సీపీఐ రాష్ట్ర సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

దసరా తరువాత మున్సిపల్ కార్మికుల సమ్మె

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజల పండుగ అవసరాల దృష్ట్యా దసరా పండుగ అనంతరం ఏరోజు నుంచైనా మున్సిపల్ కార్మికుల సమ్మెకు సిద్ధం కావాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. స్థానిక గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆసుల రంగనాయకులు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల జీపీఎఫ్ ఖాతాలు తెరవడానికి తాత్సారం చేస్తున్నదన్నారు. కార్మికులపై అదనపు పని భారం పెరిగిందని, కరోనా కాలంలో పనిచేసిన కార్మికులను కొనసాగింపులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. గత క్లాప్ డ్రైవర్లకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లకు, స్కూల్ స్వీపర్లకు కనీస వేతనాలు పెంచాలని, అధికారుల వేధింపులు ఆపాలని కోరుతున్నా ఈ ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం లేదన్నారు. ఈ దశలో సమ్మె ఒక్కటే కార్మికులకు ఆయుధమన్నారు. ఉద్యోగ,కార్మికులంతా సంఘటితంగా సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న దాదాపు 60 వేల మంది పర్మినెంట్ ఒప్పంద ఉద్యోగ, కార్మికుల, సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వయంగా అసెంబ్లీలో ప్రకటించిన విధంగా ఒప్పంద కార్మికులను ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేయకుండా ఉట్టికి స్వర్గానికి కాకుండా అప్కస్‌లో చేర్చి ఇప్పుడు ఈ వీరి కుటుంబ సభ్యులకు రావలసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ నిలిపేసి ఎన్ని మార్లు ఆందోళనలు చేసినా కల్లబొల్లి మాటలతో జగన్మోహన్ రెడ్డి పలాయనం చిత్తగిస్తున్నాడన్నారు. ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు, సలహాదారుల వేతనాలకు ఖర్చు చేసే మొత్తంలో 20 శాతం ఖర్చుపెట్టిన యథావిధిగా సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. థర్డ్ పార్టీ వద్దని వారు మోసకారులని కార్మికుల శ్రమ దోచుకుంటారని చెప్పి క్లాప్ నిర్వహణ వైసీపీ అనుయాయులకు ఇచ్చి వారికి 18,500 రూపాయలు వేతనాలు ఇవ్వకుండా రూ.10వేలు కార్మికులకు బెదిరించి ఇచ్చే ఏ ఒక్క కాంట్రాక్టర్లపై ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. రెండున్నర సంవత్స రాలుగా సరెండర్ లీవుల ఎన్‌క్యాష్మెంట్ సొమ్ము మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఐఏఎస్ ల నుంచి పర్మినెంట్ కార్మికుల వరకు ఇవ్వకుంటే ఈ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి ఏలా అవుతుందన్నారు. ఈ దశలో అక్టోబరు 8న క్లాప్ డ్రైవర్ల రాష్ట్ర సదస్సు నిర్వహించి అక్టోబరు 15న హిందూపూర్‌లో ఇంజనీరింగ్ ఉద్యోగ సిబ్బంది,ఆఫీస్ స్టాఫ్ లతో రాష్ట్ర సదస్సులు జరిపి సమ్మెకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారుడు నెక్కంటి సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బందెల రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.మల్లేశ్వరరావు, కోశాధికారి తాడికొండ వాసు,ఉపాధ్యక్షులు నాసర్ వలి, దుర్గారావు,కార్యదర్శులు పులగం మద్దిలేటి,రాజేష్ గౌడ్, భజంత్రీ శ్రీనివాస్,క్లాప్ డ్రైవర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సమితి సభ్యులు సురేష్, తారక రామారావు, మేరీ, సుబ్బారావు, ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అక్రమ ప్రాజెక్టులు ఆపండి

రాష్ట్ర ప్రభుత్వానికి ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు వినతి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): తెలంగాణ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ ఎపెక్స్ కౌన్సిల్ నుంచి ఏ విధమైన అనుమతులు తీసుకోకుండా శ్రీశైలం ఎగువ భాగాన 90 టీఎంసీలతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిందని, దీనివలన ఏపీ రైతులు తీవ్రంగా నష్టపోతారని, ముఖ్యమంత్రి తక్షణం స్పందించి అనుమతి లేని ప్రాజెక్టులను అడ్డుకోవాలని సాగునీటి వినియోగదారుల సంఘా ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు డిమాండ్ చేశారు. గాంధీ నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతి లేదని, దీనిమీద 2016లో తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులు సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేశారన్నారు. దీనిపై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి, దిండి ఎత్తి పోతల పథకాలు కొత్తవేనని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తరువాత చేపట్టినవేనని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. దీనిపై మన రాష్ట్ర ప్రభుత్వం సరైన సమయంలో స్పందిం చకపోవడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సర్వేల కోసం పాలమూరు-రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల పథకాలకు ఇచ్చిన జీవోలను పరిపాలన అనుమతు లుగా తెలంగాణ ప్రభుత్వం చిత్రీకరి స్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘించి ప్రాజెక్టుల నిర్మాణాన్ని కొనసాగిస్తుంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చోద్యం చూస్తుం డటాన్ని తీవ్రంగా ఖండించారు. శ్రీశైలం జలాశయంలో 834 అడుగులు నీటి నిల్వ ఉన్నప్పుడు తాగునీటి అవసరాలకు తప్ప ఏ ఇతర అవసరానికి వాడుకోవడానికి వీలులేదని చెప్పారు. కానీ పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు 800 అడుగులు నుండే శ్రీశైలం షోర్ నుంచి మొదలవుతుందని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి తో పాటు శ్రీశైలం ఎగువ భాగాన చట్టవిరుద్ధంగా అనేక ప్రాజెక్టులు చేపడుతోందని ఆరోపించారు. అవి పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కింద ఉన్న 15 లక్షల ఎకరాల ఆయకట్టు, కృష్ణ డెల్టా కింద ఉన్న 13 లక్షల ఎకరాల ఆయకట్టు, ఎస్ఆర్‌బీసీ కింద ఉన్న రెండు లక్షల ఎకరాల ఆయకట్టుతో కలిపి మొత్తం 30 లక్షల ఎకరాల ఆయకట్టుకు చుక్క నీరు అందే అవకాశం లేదని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని సమర్థవంతంగా వినిపించి మన రైతుల నీటి హక్కులు కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర సమాఖ్య కార్యవర్గ సభ్యులు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ ఎనమద్ది పుల్లయ్య చౌదరి(ఎన్టీఆర్ జిల్లా), కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ (కృష్ణాజిల్లా), కార్యవర్గ సభ్యులు మాజీ డిస్ట్రి బ్యూటరీ కమిటీ చైర్మన్‌లు బొర్రా అశోక్ కుమార్ (ఎన్‌టీఆర్ జిల్లా), గుండపనేని శ్రీనివాసరావు, మైనేని వెంకట నరేంద్ర(కృష్ణా జిల్లా), ఉప్పలపాటి చక్రపాణి(ప్రకాశం జిల్లా) తుమ్మల లక్ష్మణరావు, మాదాల నరేంద్ర(ఏలూరు జిల్లా), మరీదు ఏడుకొండలు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన సీఎం జగన్

రాష్ట్రంలో 17 నూతన వైద్య కళాశాలలు: మంత్రి విడదల రజిని

రోడ్ల సమస్యలపై పీడీఎఫ్ వాయిదా తీర్మానం తిరస్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ చరిత్రలోనే 17 నూతన వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి సీఎం జగన్ చరిత్ర సృష్టించారని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సమావేశాలు చివరి రోజు బుధవారంతో ముగిశాయి. ఈ సమావేశంలో విద్యా, వైద్య రంగాల సమస్యలపై చర్చించారు. తొలుత సమావేశం ప్రారంభం కాగానే, రాష్ట్రంలోని రహదారుల ఏర్పాటు అంశంపై పీడీఎఫ్ సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ తదితరులు వాయిదా తీర్మానం ఇవ్వగా, దానిని చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తిరస్కరించారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయంలో వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు శాఖల వారీగా మంత్రులు బదులు ఇచ్చారు. మొదటగా గ్రామీణ ఆరోగ్య కేంద్రాల స్థితిగతులపై సభ్యులు కల్పలత, రమేశ్ యాదవ్, మాధవరావు, రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలల ఏర్పాటుపై సభ్యులు తోట త్రిమూర్తులు, దువ్వాడ శ్రీనివాస్, మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు అడిగిన ప్రశ్నలకు వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 17 నూతన వైద్య కళాశాలను రూ.8,500 కోట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి పార్లమెంటు పరిధిలో ఒక వైద్య కళాశాల ఉండేలానేది సీఎం ఆకాంక్ష అని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో నంద్యాల, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నంలో వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఒక్కో వైద్య కళాశాలలో 150 సీట్లు ఉంటాయని, మొత్తంగా ఐదు వైద్య కళాశాలలకు కలిపి 750 సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో మరిన్ని వైద్య కళాశాలలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. పేదలు అనారోగ్యానికి గురైతే గతంలో వైద్య అందని పరిస్థితి ఉండేదని, పరీక్షల పరికరాల్లోనూ చాలా కొరత ఉండేదని గుర్తు చేశారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన తర్వాత గ్రామ స్థాయిలోనే వైద్యసేవల విస్తరణకు శ్రీకారం చుట్టారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా 2 కోట్ల 30 లక్షల మంది ఈ సేవలను ఉపయోగించుకుంటారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు వైద్యులు ఉంటే ఒక వైద్యుడు విధులకు, మరో వైద్యుడు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో విధులు నిర్వహిస్తారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా వైద్య రంగంలో ఖాళీల కొరత లేకుండా సీఎం జగన్ చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 53,190 మంది వైద్య సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకున్నామని మంత్రి వివరించారు.

సున్నా వడ్డీని నీరుగార్చిన టీడీపీ

- డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు
- మండలిలో వివిధ బిల్లులకు ఆమోదం
- స్కిల్ కుంభకోణంపై స్వల్పకాలిక చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత టీడీపీ ప్రభుత్వం సున్నా వడ్డీని నీరుగార్చిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి) బూడి ముత్యాల నాయుడు ఆరోపించారు. శాసన మండలిలో బుధవారం వైఎస్సార్ సున్నా వడ్డీ రుణ పథకం అమలు తీరుపై సభ్యులు కల్యాణి, కల్పలత, సునీత తదితరులు అడిగిన ప్రశ్నలకు బూడి ముత్యాల నాయుడు సమాధానమిచ్చారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ పేరుతో చంద్రబాబు మోసగించారని, 3 వేల 36 కోట్ల రూపాయిలు ఎగవేశారని వివరించారు. రూ.25,571 కోట్ల బకాయిలు పెట్టారని, వారిని పూర్తిగా కష్టాల్లో ముంచారని మండిపడ్డారు. నాడు సీఎం జగన్ పాదయాత్రలో డ్వాక్రా మహిళల కష్టాలను ఆలకించి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. గతంలో డ్వాక్రా మహిళల తీసుకునే రుణాలకు వడ్డీ 13 శాతం ఉండగా, దానిపై సీఎం జగన్ బ్యాంకర్లతో మాట్లాడి, ఆ వడ్డీని ఏడు శాతానికి తగ్గించారని వివరించారు. నాడు వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక ఆసరా పథకాన్ని తీసుకొచ్చి వారికి అండగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

పేదలకు నాణ్యమైన బియ్యం : పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

రాష్ట్రంలో పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తున్న బలవర్ధకమైన బియ్యం పంపిణీపై సభ్యులు త్రిమూర్తులు, రవీంద్రబాబు తదితరులు అడిగిన ప్రశ్నలకు... పౌర సరఫరాల సంస్థ ద్వారా పొందిన రుణాల విషయంపై సభ్యులు రామారావు, అశోక్‌బాబు, తిరుమల నాయుడు, అనురాధ అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని పేదల కోసం నాణ్యమైన పోర్టిఫైడ్ బియ్యాన్ని ఈ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి చెప్పారు. ఈ రైస్‌లో ఐరన్ ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బి12 ఉంటాయని వివరించారు. ఇవి ప్లాస్టిక్ అంటూ కొందరు విష ప్రచారం చేయడాన్ని ఖండించారు. ఇప్పటికే సార్టెక్స్ బియ్యం పేదలకు చేరువ చేసేందుకుగాను రూ.300 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ బియ్యం కడిగినా, ఉడికించినా గంజి వారపెట్టినా పోషకాలు పోబోవని చెప్పారు. 26 జిల్లాల్లో రెండు లక్షల 9 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా పేదలకు అందజేస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో ఆర్టీసీ భూముల లీజు, కొత్త బస్సుల కొనుగోలుపై సభ్యులు ఇళ్ల వెంకటేశ్వర రావు, షేక్ సాబ్జీ, కె.ఎస్.లక్షణరావు అడిగిన ప్రశ్నలకు రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమాధానం ఇచ్చారు. ఇళ్ల పట్టాల పంపిణీ విషయంపై సభ్యులు భరత్, రమేశ్ యాదవ్, కల్పలత అడిగిన ప్రశ్నకు ప్రభుత్వ భూములు, పట్టా భూముల ఆక్రమణ విషయాలపై సభ్యులు రామ్‌గోపాల్‌రెడ్డి, తిరుమల నాయుడు, అనురాధ తదితరులు అడిగిన ప్రశ్నలకు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు బదులిచ్చారు. తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా నాయీ బ్రాహ్మణులు, రజకులను ప్రతిపాదించిన విషయంపై సభ్యులు రామారావు, తిరుమల నాయుడు, చిరంజీవిరావు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ సమాధానమిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ సివిల్ కోర్టు బిల్లు-2023ను సీఎం వైఎస్ జగన్ తరఫున మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ మండలిలో ప్రవేశపెట్టగా, ఆమోదం పొందింది. అనంతరం కేంద్ర ప్రభుత్వ కోరిక మేరకు గవర్నమెంట్ సెక్యూరిటీస్ చట్టం-2006కు సవరణల కోసం రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు.

అనంతరం ప్రభుత్వానికి స్పెషల్ మెన్షన్ ద్వారా వివిధ అంశాలను చైర్మన్‌కు సభ్యులు విన్నవించారు. మొదటగా రాష్ట్రంలో చెప్పులు కట్టుకునే వర్గానికి ఇతర చేతి/కుల వృత్తుల వారికి అందించినట్లు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించాల్సిందిగా సభ్యుడు బొమ్మి ఇజ్రాయేల్, తణుకు ఏరియా ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్ నిర్వహణకు అవసరమైన నిధులు విడుదల చేయాలని సభ్యుడు వంకా రవీంద్ర నాథ్, మునిసిపల్ స్కూల్స్‌లో పని చేస్తున్న స్వీపర్లకు బకాయిలు ఉన్న జీతాలు చెల్లించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్‌కు చెల్లించాల్సిన నిధుల మొత్తం విడుదల చేయాలని సభ్యుడు షేక్ సాబ్జీ, 1 జనవరి 2023 నుంచి జీపీఎఫ్‌పై వడ్డీ రేటును 7.2 శాతం ప్రకటిస్తూ ఉత్తర్వుల కోసం సభ్యురాలు కల్పలత మాట్లాడారు. గురుకులాల ఉద్యోగులు అందరికి పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని సభ్యుడు రఘువర్మ కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు చెల్లిస్తున్నట్లు గెస్ట్ అధ్యాపకులకు కూడా సమాన వేతనాలు చెల్లించాలని సభ్యుడు ఇళ్ల వెంకటేశ్వర రావు, ప్రైవేట్ పాఠశాలల సమస్యలు తీర్చాలని సభ్యుడు రామచంద్రారెడ్డి, సమగ్ర శిక్షలో పని చేస్తున్న బోధనా సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని సభ్యుడు చంద్రశేఖరరెడ్డి స్పెషల్ మెన్షన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. అనంతరం శాసన మండలిని కొద్దిసేపు వాయిదా వేశారు.

స్కిల్ కుంభకోణంపై చర్చ

తిరిగి సమావేశం ప్రారంభమైన తర్వాత ఇటీవల బయటపడిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై గత మంగళవారం చర్చను కొనసాగించాలని సభ్యుడు మాధవ రావుకు చైర్మన్ సూచించారు. సభ్యుడు మాధవ రావు మాట్లాడుతూ ఈ కుంభకోణంలో డిజైన్ టెక్ సంస్థ వారు నిబంధనల మేరకు జీఎస్టీ చెల్లించక పోవడంతో మొత్తం వ్యవహారం బయట పడిందన్నారు. మరో సభ్యుడు పండుల రవీంద్ర బాబు మాట్లాడుతూ చంద్రబాబు చేసిన అవినీతి చిన్న విషయం కాదని, ప్రజలు చెల్లించే పన్నులు అవినీతి మార్గంలో పొందడం దేశ ద్రోహం కంటే పెద్ద నేరమని అన్నారు. అనంతరం వరుదు కళ్యాణి తదితర సభ్యులు మాట్లాడిన తర్వాత శాసన మండలిని నిరవధికంగా వాయిదా వేశారు.

అంగన్‌వాడీ శ్రామిక మహిళలపై అణచివేతకు నిరసనగా ఢిల్లీలో ర్యాలీ, ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్ర ప్రదేశ్‌లో అంగన్‌వాడీ మహిళలపై అణచి వేతకు నిరసనగా ఢిల్లీలో ర్యాలీ, ధర్నా జరిగింది. ఏపీ అంగన్‌వాడీ మహిళల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎఫ్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ కార్మిక సంఘాల అధ్వర్యంలో విజయవాడలో గత సోమవారం అంగన్‌వాడీ మహిళలు నిషేధాజ్ఞలను ధిక్కరించి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా ఏపీ ప్రభుత్వం సాగించిన అణచివేతకు నిరసనగా బుధవారం ఢిల్లీ ఏపీ భవన్ ఎదుట ఇఫ్టూ ఢిల్లీ రాష్ట్ర కమిటీ ధర్నా నిర్వహించింది. ధర్నాకు పోలీసులు అనుమతిని నిరాకరించారు. అయినప్పటికీ ప్రదర్శకులు ర్యాలీగా వెళ్లి కొంతసేపు నినాదాలు చేశారు. అంగన్‌వాడీ మహిళలపై ఏపీ ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ

నినదించారు. ఏపీ అంగన్‌వాడీల మహిళల సమస్యల పరిష్కారం కోసం ఏపీ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. పోరాటం చేస్తున్న ఏపీ అంగన్వాడీ మహిళలకు తమ సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి, దమనకాండ విధానాన్ని ఎదిరించి పోరాడుతున్న ఏపీ అంగన్వాడీ శ్రామిక మహిళలు ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఢిల్లీ కార్మికవర్గం పక్షాన వారు జేజేలు పలికారు. ఆ తర్వాత అసిస్టెంట్ రెసిడెంట్ కమిషనర్ హిమాంశ్ కౌశిక్‌కు వారు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ ప్రతినిధివర్గాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ తనకు సమర్పించిన వినతి పత్రాన్ని ఏపీ ప్రభుత్వానికి పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇఫ్టూ ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షులు అనిమేష్ దాస్, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మృగాంక్, ప్రగతిశీల మహిళా సంఘటన ఢిల్లీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనమ్ కౌశిక్, సహాయ కార్యదర్శి రీనా, జన హస్తక్ షెప్ డాక్టర్ వికాస్ వాజపాయ్ తదితరులు పాల్గొన్నారు. ఇఫ్టూ అఖిల భారత కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై సందేశం ఇచ్చారు.

ప్రజల కోసమే చంద్రబాబు తపన

నారా భువనేశ్వరి

విశాలాంధ్ర-సీతానగరం: ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే నాయకుడు చంద్రబాబు అని ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో టీడీపీ దీక్షా శిబిరాన్ని భువనేశ్వరి బుధవారం సందర్శించారు. రాజానగరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి నేతృత్వాన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భువనేశ్వరి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం నిరంతరం ఆలోచించే మంచి మనిషి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో 84 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా సుమారు రెండు లక్షల మంది ఉపాధి అవకాశాలు పొందారని, స్వయానా కంపెనీలు ఏర్పాటు చేసి మంచి స్థాయిలో ఉన్నారని తెలిపారు. పాడేరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వేల సంఖ్యలో ఉపాధి పొందారన్నారు. ఆధారాలు లేని అరెస్టులు మునుపెన్నడూ చూడలేదని, 371 కోట్ల రూపాయలు ఎవరి ఖాతాలోకి వెళ్లాయో సీఐడీ ఇప్పటికీ చెప్పలేదని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఓటును ఆయుధంగా మలచుకొని వైసీపీ ప్రభుత్వాన్ని కూలదోయాలని కోరారు. స్త్రీ శక్తి గురించి బాగా తెలిసిన నాయకుడు చంద్రబాబు అని అన్నారు. టీడీపీ అంటే ఒక కుటుంబమని, దానికి ఏ కష్టం వచ్చినా అందరూ తోడుగా ఉంటూ విజయం సాధించాలని కోరారు. మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, మాజీ మంత్రులు ప్రతిపాటి పుల్లారావు, జవహర్, నాయకులు కాండ్రు శ్రీనివాస్, శేఖర్, చుండ్రు ప్రసాద్, కృష్ణ చైతన్య, చిట్టూరి శారదా రంగారావు, కృష్ణా, పోసియ్యా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ శాట్-1 ప్రయోగం సక్సెస్

కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ

విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి రూపొందించిన కేఎల్ శాట్-1 విజయవంతం అయింది. విశ్వవిద్యాలయ చైర్మన్ కోనేరు సత్యనారాయణ సతీసమేతంగా హాజరై స్వహస్తాలతో శాటిలైట్‌ను నింగిలోకి వదిలారు. సర్వత్రా ఉత్కంఠ నడుమ కొనసాగిన ఈ ప్రక్రియ విజయవంతమైంది. ప్రత్యేకంగా చెన్నైలో తయారు చేయించిన బెలూన్‌లో గ్యాస్‌ను నింపడంతో ఆ బెలూన్ కాస్తా తేలికై భూ గురుత్వాకర్షణను దాటుకుని నింగిలోకి దూసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న సమయంలో సరిగ్గా కిలోన్నర బరువున్న చిన్న తరహా ఉపగ్రహాన్ని ఆ బెలూన్‌కి అనుసంధానం చేసి నింగిలోకి పంపారు. అంతా అనుకున్నట్లుగానే... పరిశోధకులు ముందుగా చెప్పినట్లుగానే సుమారు గాలిలో గంటన్నర పాటు ప్రయాణించిన కేఎల్ శాట్-1 భూమి గురుత్వాకర్షణ దాటుకుని సుమారు 35 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. అక్కడ కొంతసేపు ఉన్న తరువాత మండే సూర్య తాపానికి గ్యాస్‌తో నిండి ఉన్న బెలూన్ ఒక్కసారిగా పగిలిపోయింది. దాంతో వెంటనే భూ గురుత్వాకర్షణకు లోనైన ఉపగ్రహం తిరిగి సమాంతరంగా భూమిని వేగంగా చేరుకునే ప్రయత్నం చేస్తున్న సందర్భంలో అప్పటికే అనుసంధానించబడి ఉన్న పారాషూట్ యాక్టివేట్ అయి ఉపగ్రహ వేగాన్ని నియంత్రిస్తుంది. నిదానంగా భూమిని చేరుకుంటున్న ఉపగ్రహం కేఎల్ యూనివర్సిటీకి 80 కిలోమీటర్ల వృత్తంలో ఏదో ఒక ప్రాంతంలో పడే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. శాటిలైట్ పంపిన సిగ్నల్స్ ప్రకారం సత్తెనపల్లి సమీపంలో ట్రాక్ అవుతున్నట్లు రూపకర్త డాక్టర్ కె.శరత్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా వర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ తమ విద్యార్థులు రూపొందించిన శాటిలైట్‌ను తాను ప్రయోగించడం చారిత్రతాత్మక ఘట్టమని అన్నారు. గన్నవరం, చెన్నై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతితో ఈ ప్రయోగం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ కార్యదర్శి కోనేరు శివకాంచనలత, వైఎస్ చైర్మన్ కోనేరు రాజా హరీన్, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అన్ని విభాగాల డీన్‌లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొని శాటిలైట్ రూపొందించిన విద్యార్థులను, డాక్టర్ కె.శరత్ కుమార్, శ్రీకావ్య, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్‌ను అభినందించారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No: 24/2023-24/CE/SE(P-II)EE(PD-I)/DB/GVMC, Dt: 26-09-2023
Number of works-06, Value of works: Rs.20.82 Crores
Tender Opening Date: 26-09-2023.
Tender Closing Date: 09-10-2023.
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE(PD-I) Cell No.98483 08824.
Sd/- Commissioner, GVMC, Visakhapatnam

సంపాదకీయం

న్యాయవ్యవస్థను లొంగదీసే ప్రయత్నం

దేశంలోని వివిధ హైకోర్టుల్లో 60 లక్షల 72వేల, 729 కేసులు విచారణ పూర్తి కాకుండా మిగిలిపోయాయి. సుప్రీంకోర్టులో 80,591 కేసులు తేలాల్సి ఉన్నాయి. ఇలా కేసులు తెమలకుండా ఉండడానికి అనేక కారణాలు ఉండొచ్చు. ప్రధానమైన, నివారించదగిన కారణం మాత్రం న్యాయమూర్తుల స్థానాలు ఖాళీగా పడి ఉండడం. ఈ సమస్యను పరిష్కరించడం అంత కష్టమైన పనేం కాదు. న్యాయమూర్తుల నియామకానికి కొలీజియం వ్యవస్థను అనుసరిస్తున్నాం. హైకోర్టులలోనూ, సుప్రీంకోర్టులోనూ ఇదే పద్ధతి కొనసాగుతోంది. కొలీజియం ఫలానా వారిని న్యాయమూర్తిగా నియమించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. హైకోర్టుల న్యాయమూర్తుల విషయంలోనైతే కొలీజియం సిఫార్సులను పరిశీలించిన తరవాత రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖకు ఈ పేర్లను పంపుతుంది. హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను మాత్రం ఇతర రాష్ట్రాల వారినే నియమిస్తున్నారు. అధికారికంగా ఈ ప్రతిపాదన, సిఫార్సులు, ఆమోదం తంతు పూర్తి అయిన తరవాత భారత రాష్ట్రపతి హైకోర్టు న్యాయమూర్తులను నియమిస్తారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఎవరిని నియమించాలో ప్రధాన న్యాయమూర్తితో కూడిన కొలీజియం ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతుంది. న్యాయమంత్రిత్వ శాఖ వీటిని పరిశీలించి రాష్ట్రపతికి నివేదిస్తుంది. అప్పుడు రాష్ట్రపతి సుప్రీంకోర్టు న్యాయమూర్తులను నియమిస్తారు. ఇదంతా నిర్దిష్టమైన ప్రక్రియే. దీనికి మెమొరాండం ఆఫ్ ప్రొసీడింగ్స్ అన్న పేరుంది. దీని ప్రకారం ప్రభుత్వాలు హైకోర్టుల, సుప్రీంకోర్టు కొలీజియం ప్రతిపాదనలను పరిశీలించి ఆమోదించవలసిందే. కానీ నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరవాత న్యాయవ్యవస్థ ప్రతిపాదనలను ఆమోదించకుండా రెండు పద్ధతులు అనుసరిస్తున్నారు. ఒకటి ప్రతిపాదన అందిన తరవాత నెలల తరబడి ఉలక్కుండా పలక్కుండా ఉండిపోవడం. రెండు తమకు నచ్చని పేర్లను ప్రతిపాదించిన జాబితాలోంచి తొలగించడం. అంటే న్యాయవ్యవస్థ ప్రతిపాదనలను సంపూర్ణంగా అంగీకరించకుండా పాక్షికంగా మాత్రమే ఆమోదించడం. రాష్ట్రాలలోని హైకోర్టులలో 1,114 మంది న్యాయమూర్తులు ఉండాలి. కానీ ఉన్నది 774మంది మాత్రమే. అంటే 340 న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయి. సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తులు ఉండాలి. కానీ ప్రస్తుతం పని చేస్తున్నది 32 మందే. హైకోర్టుల, సుప్రీంకోర్టు కొలీజియం న్యాయమూర్తుల నియామకానికి ప్రతిపాదనలు పంపడం హడావుడిగా కొనసాగించే వ్యవహారం కాదు. తాపీగా సాగేది అంతకన్నా కాదు. ముందు నుంచే ప్రయత్నాలు సాగుతూనే ఉంటాయి. కొలీజియం ఓ నిర్ణయానికి వచ్చిన తరవాత ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతుంది. ఈ ప్రతిపాదనలను ఆమోదించి నియామకానికి కావలసిన తదుపరి చర్యలు తీసుకోవడం ప్రభుత్వం బాధ్యత. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ ఆనవాయితీకి తరచుగా భంగం కలుగుతోంది. న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించడం ఏమిటి అన్న చర్చ చాలా కాలంగా వినిపిస్తున్నదే. అయితే ఇప్పుడు అమలులో ఉన్న విధానం ఇదే. దీనిని మార్చే దాకా ఈ ప్రక్రియకు కట్టుబడి నడుచుకోవాలి. ఈ కారణంగా ఖాళీల భర్తీ జాప్యం కావడంతో పాటు న్యాయమూర్తులుగా నియమితులు కావలసిన వారు విసాగొచ్చి ఆ ప్రతిపాదననే ఒప్పుకోకుండా తమ పని తాము చేసుకు పోతున్నారు. దీనివల్ల ప్రతిభగల న్యాయమూర్తులను నియమించడం జాప్యం అవుతోంది. లేకపోతే అసాధ్యం అవుతోంది. కిరణ్ రిజిజు కేంద్ర న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు న్యాయ వ్యవస్థకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడానికే ఎక్కువ సమయం కేటాయించే వారు. కొలీజియం ప్రతిపాదనలను అంగీకరించడానికి ఎప్పుడూ ఏదో ఓ పేచీ పెట్టారు. డి.వై. చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన తరవాత ఈ రగడ అనేక సార్లు బహిరంగం అయింది. చివరకు రిజిజును న్యాయమంత్రిత్వ శాఖ నుంచి తప్పించి అర్జున్ రాం మేఘ్వాల్ ను ఆ స్థానంలో నియమించారు. న్యాయమంత్రి మారినా పరిస్థితిలో పెద్ద మార్పు లేదు. హైకోర్టుల కొలీజియంలు సిఫార్సు చేసిన 70 పేర్లు పది నెలలుగా ప్రభుత్వ అంగీకారం లేక నిలిచిపోవడంవల్ల ఆ ఖాళీలు భర్తీ చేయడంలో జాప్యం జరుగుతోంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సుధాంశు ధులియాతో కూడిన బెంచి మంగళవారం ఈ విషయం తెలియజేసింది. తమ ప్రతిపాదనల గతి ఏమైందో చెప్పాలని అటార్నీ జనరల్ ఆర్. వెంకటారమణిని ప్రశ్నించారు. వారం రోజుల గడువు కావాలని అటార్నీ జనరల్ కోరితే అత్యున్నత న్యాయస్థానం అక్టోబర్ తొమ్మిది దాకా గడువు ఇచ్చింది. మోదీ ప్రధానమంత్రి అయిన కొద్ది నెలలకే కొలీజియం సిఫార్సుల విషయంలో తాత్సారం చేయడం మొదలైంది. నిజానికి అది న్యాయవ్యవస్థ ప్రభుత్వానికి అనుగుణంగా నడుచుకోవాలని పరోక్షంగా హెచ్చరించడమే. గోపాల్ సుబ్రహ్మణ్యం ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం చేసిన ప్రతిపాదనను మోదీ ప్రభుత్వం తిరస్కరించింది. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తి కానే లేదు. సొహ్రాబుద్దీన్ హత్య కేసులో గోపాల్ సుబ్రహ్మణ్యం కీలక పాత్ర పోషించడమే దీనికి కారణం అన్నది బహిరంగ రహస్యమే. ఆ తరవాత ఇదే సందర్భంలో తులసి ప్రజాపతి కూడా హత్యకు గురయ్యాడు. అప్పుడు గుజరాత్ లో నరేంద్ర మోదీ ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న అమిత్ షా ఈ హత్యాకాండల సూత్రధారి అన్న ఆరోపణలు వచ్చాయి. ఇదే వ్యవహారంలో అమిత్ షా 2010లో అరెస్టయ్యారు. ఆయన రెండేళ్ల పాటు గుజరాత్ లో ప్రవేశించకూడదన్న ఆంక్ష కూడా విధించారు. అంటే సుబ్రహ్మణ్యం సుప్రీంకోర్టు న్యాయమూర్తి కాకుండా అడ్డుపడింది ఆయన ప్రతిభతో నిమిత్తం లేకుండా కేవలం రాజకీయాలతో ముడిపడింది. అలాంటప్పుడు ప్రస్తుతం కేంద్రంలో అమిత్ షా హోం మంత్రిగా ఉన్నప్పుడు కొలీజియం ప్రతిపాదనను అంగికరిస్తారనుకోవడం భ్రమే. కొలీజియం సిఫార్సులపై ప్రభుత్వానికి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తిరిగి పంపొచ్చు. అప్పుడు కొలీజియం సవరించి పంపొచ్చు. లేదా యథాతథంగా పంపితే అంగీకరించడం తప్ప ప్రభుత్వానికి మరో మార్గం లేదు. ఇప్పుడున్న విధానం అది. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి వాటిని పూర్తిగా లోబరచుకున్నారు. న్యాయవ్యవస్థను కూడా అదే పద్ధతిలో లోబరచుకోవడానికి ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇది రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన అధికార విభజనకు విరుద్ధమైన నడవడిక. న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా నడుచుకోవడానికి అడ్డు తగలడమే. న్యాయస్థానాల్లో పరిశీలనకు వచ్చే కేసుల్లో ఎక్కువ భాగం ప్రభుత్వంతో సంబంధం ఉండేవే ఉంటాయి. అందుకని ఆ వ్యవస్థ ప్రభుత్వానికి అడుగులకు మడుగులొత్తే రీతిలో ప్రవర్తించేట్టు చేయాలన్నది ప్రభుత్వ ఆంతర్యం. ఈ వైఖరి కొత్తది కాకపోవచ్చు. గతంలో కూడా ఇలాంటి ఉదంతాలు లేకపోలేదు. అప్పుడు నిబద్ధ న్యాయవ్యవస్థ అన్న వాదనలు వినిపించాయి. ఇప్పుడు అక్కడితో ఆగకుండా న్యాయవ్యవస్థను లోబరచుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కొలీజియం వ్యవస్థకు బదులు మరో విధానాన్ని ప్రవేశ పెట్టడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంది. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి తీసుకొచ్చిన చట్టాన్ని సుప్రీంకోర్టు గతంలో కొట్టి వేసింది. అందుకని ప్రభుత్వం ఆ పని చేయకుండా ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోంది.

వామపక్ష ప్రభుత్వం ఏర్పాటును అడ్డుకుంటున్న మితవాదులు

సాత్యకి చక్రవర్తి

గ్వాటమాలాలో ఆగస్టు 20న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధ్యక్ష పదవికి వామపక్షానికి చెందిన బెర్నార్డో అరివలో విజయం సాధించారు. అయితే 2024, జనవరి 14న అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారంచేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా మితవాదులు, బహుళజాతి కంపెనీలు, బడా వాణిజ్యవేత్తలు అడ్డుకుంటున్నారు. వామపక్ష అభ్యర్థి చరిత్రాత్మకమైన విజయం సాధించారు. అయినప్పటికీ, ప్రభుత్వ సంస్థలు, జడ్జీలు, కోర్టులు, అటార్నీ జనరల్ కార్యాలయం తమ చేతుల్లో ఉన్న అధికారం మేరకు అరివలో ప్రభుత్వం ఏర్పడకుండా చేస్తున్నారు. ఒక సైనిక తిరుగుబాటు తప్పితే, అన్ని రకాలుగా వామపక్షాన్ని అధికారంలోకి రాకుండా చేస్తున్నారు. అరివలో ప్రభుత్వం ఏర్పడితే, సమాజంలో ప్రజాస్వామ్య హక్కులు ఉండవని, వీళ్ళ మన ఆస్థులను స్వాధీనం చేసుకుంటారని మితవాదులు ఇతర ప్రభుత్వ యంత్రాంగం కుమ్మక్కై ప్రభుత్వం ఏర్పడకుండా చేస్తున్నారు. ఇటీవల రోజుల్లో నిశ్శబ్దంగా తిరుగుబాటు చేయడానికి తగిన వాతావరణాన్ని కల్పించేటట్టుగా అటార్నీ జనరల్ కార్యకలాపాలు ఉన్నాయి. జడ్జిలు, ప్రాసిక్యూటర్‌లు ఎన్నికల చట్టాలను ఉల్లంఘించారు. అలాగే రాజ్యాంగాన్ని ఖాతరు చేయకుండా గెలిచిన పార్టీకి వ్యతిరేకంగా క్రిమినల్ కేసు దాఖలు చేయాలని అనుకుని తిరిగి ఆ ఆలోచనను విరమించుకున్నారు. అంతేకాదు, వామపక్ష నాయకులను, అభ్యర్థులను అరెస్టుచేసి జైళ్లలో పెట్టి హింసించాలని కూడా ప్రయత్నించారు. ఈ కార్యకలాపాలన్నీ అమలుజరిగే సమయంలో అమెరికన్ స్టేట్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి లూయిస్ అల్మగ్రో దేశంలోనే ఉన్నారు. దేశంలో ఉన్న అనేక తీవ్రమైన సవాళ్లను అరివలో ప్రభుత్వం ఎదుర్కోగలదని ప్రజలు ఎదురుచూశారు. ఒకవేళ అరివలో ప్రమాణస్వీకారం చేసినప్పటికీ, దేశంలో రాజకీయ కల్లోలాలను సృష్టించాలని మితవాదులు నిర్ణయించారు. అందువల్ల ప్రభుత్వాన్ని నడపడం కూడా కష్టంగా ఉంటుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాక సమర్థవంతమైన, తగిన అర్హతగల మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయవలసిఉంటుంది. అయితే ప్రగతిశీల అజెండాను అమలుచేయడం అత్యంత కష్టంగా ఉంటుంది. కాంగ్రెస్(పార్లమెంటు)లో ఎక్కువగా మితవాద పార్టీల అభ్యర్థులు ఉన్నారు. అదే సమయంలో, న్యాయవ్యవస్థకూడా ప్రభుత్వానికి అండగా నిలవదు. అరివలో నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు చేసినప్పటికీ అది ఫలించేలాగా పరిస్థితులు లేవు. సంకీర్ణకూటమి నాయకులపైన విచ్చలవిడిగా కేసులు నమోదుచేస్తున్నారు. తనను ఎన్నుకుంటే ప్రజలకు భూమి హక్కులు కల్పిస్తానని, ఆరోగ్యభద్రత, విద్య సౌకర్యాలను అణగారిన వర్గాల ప్రజలకు కల్పిస్తానని ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేశారు. దేశంలో ఉన్నతస్థాయిలో ఉన్న 5శాతం మంది అభివృద్ధి ఫలాలను పొందుతుండగా 30శాతం మంది పేదరికానికి ఇంకా దిగువస్థాయిలో బతుకుతున్నారు. వచ్చే ఏడాది జనవరిలో అరివలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ సంకీర్ణ ప్రభుత్వం అజెండా అమలు చేయడానికి పెద్దసవాలు ఎదుర్కోవలసి ఉంటుంది. లాటిన్ అమెరికాలో మరో వామపక్ష ప్రభుత్వం ఏర్పడనుందని భావించిన సందర్భంగా అమెరికా బహుళజాతి కంపెనీలు ప్రధానంగా ప్రభుత్వం ఏర్పడకుండా కుట్రలు పన్నాయి. గతంలో రెండుసార్లు శాంతి ఒప్పందాలు జరిగినప్పటికీ, పౌరులు ఎన్నుకున్న అధ్యక్షులు తీవ్రమైన స్థాయిలో వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. 1966-1970, 1986-1991 మధ్యలో ఆనాటి ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేకపోయాయి. ప్రజస్వామ్య పునరుద్ధరణ చేస్తామని ఇచ్చిన వాగ్దానాలను కూడా నెరవేర్చలేకపోయాయి. ఈ పరిస్థితుల వెనుక సైన్యం అన్ని వ్యవహారాలను తన గుప్పిట్లో పెట్టుకున్నది. రాజకీయ నాయకులు పౌరులకు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈసారికూడా అరివలో అలాంటి పరిస్థితే ఎదుర్కోవలసి ఉంటుంది. అవినీతికి నిలయాలైన సంస్థలను ప్రక్షాళన చేస్తానని కూడా అరివలో ఎన్నికలలో వాగ్దానం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో అనేకమంది ప్రాసిక్యూటర్లు, జడ్జిలు, జర్నలిస్టులు దేశాన్ని విడిచిపెట్టి వెళ్లారు. ఈ నేపథ్యంలో అరివలో పార్లమెంటును కూడా నియంత్రించే అవకాశం ఉండదు. తన విజయం గ్వాటమాలా ప్రజల విజయమని అరివలో అన్నారు. అరివలోకు చెందిన సెమిల్లా పార్టీ అవినీతికి వ్యతిరేకంగా, రాజకీయ భ్రష్టత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం సాగించింది. అధ్యక్ష పదవికి పోటీచేయకుండా ఇతర ప్రతిపక్షాల అభ్యర్థులను నిలువరించారు. అరివలో గెలుపు ప్రజల గెలుపని భావించి తమకు మేలు జరుగుతుందని ఆశించారు. అయితే గ్వాటమాలాలో సుదీర్ఘకాలంగా రాజకీయకల్లోలం కొనసాగుతున్న చరిత్ర ఉంది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడి ఎక్కువకాలం మన్నిన పరిస్థితిలేదు. 1944లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల శ్రామికవర్గం సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగా, నియంత జార్జి ఉబికో ప్రభుత్వాన్ని దించివేయగలిగారు. ఉబికో 1931 నుంచి 1944 వరకు పరిపాలన చేశారు. పది సంవత్సరాలపాటు 1954 వరకు ప్రజాస్వామ్య ప్రగతిశీల ప్రభుత్వాన్ని ఏర్పాటుచేవారు. ఈ దశలో అక్టోబరు విప్లవం వచ్చిందని భావించారు.

దేశభక్తిలో మేటి జాషువా

డా॥శిఖామణి

"వినుకొండన్ జనియించితిన్ సుకవితా
వేశము చిన్నప్పుడే/ ననుపెండ్లాడె, మదీయ
కావ్యములు నానారాష్ట్ర సత్కారముల్
గొనికూర్చెన్ సుయశస్సు, కల్గుదురు నాకున్
భక్తులై నేనెఱుంగని/ వారాంధ్ర ధరాతలాన,
బహుసంఖ్యంల్ సాహితీ బాంధవుల్"

అని తనను గూర్చి సగర్వంగా చెప్పుకున్న జాషువా గుంటూరుజిల్లా వినుకొండలో 1895 సెప్టెంబరు 28 వీరయ్యలింగమాంబ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులది వర్ణాంతర, మతాంతర వివాహం కావడంవల్ల ఆ నీడలు జాషువాపై వ్యాపించాయి. అంటరానితనం, ఆకలి, పేదరికం, మధ్య పెరిగిన జాషువా వాటినే తన గురువులుగా ప్రకటించాడు. ప్రతికూల పరిస్థితుల మధ్య స్వయంకృషితో చదువుకొని ఆంధ్రదేశంలో తిరుగులేని మహాకవిగా అవతరించాడు. తెలుగులో ఖండకావ్య ప్రక్రియకు విశేషమైన ప్రాచుర్యాన్ని, ప్రాభవాన్ని కల్పించి ఏడు ఖండకావ్యసంపుటులు వెలువరించారు. గబ్బిలం, పిరదౌసి, ముంతాజమహలు, క్రీస్తుచరిత్ర వంటి కావ్యాలు రాసారు. మరీ ముఖ్యంగా గబ్బిలం కావ్యం దళిత వేదనను ఆ రోజులలోనే స్పష్టంగా నిర్భీతిగా వినిపించిన కావ్యం. తెరచాటు వంటి సాంఘిక ప్రయోజనం గలనాటకాలనూ రాశాడు. కవికోకిల, మధురశ్రీనాథ, నవయుగ కవితా చక్రవర్తి పద్మభూషణ్ వంటి బిరుదులతో సత్కరించారు. ప్రథమాంధ్ర ఆస్థానకవి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి స్వయంగా జాషువా కాలికి గండపెండేరం తొడిగారు. సంప్రదాయ కవితా ధోరణిని మన్నిస్తూ, వస్తువులోనూ, శిల్పంలోనూ కొత్తదనాన్ని ప్రదర్శించిన జాషువా కవిత్వాన్ని ఎందరో ప్రముఖులు ప్రశంసించారు. "హిమాచల శిఖరాలకంటే ఉన్నతమై, సముద్రముల కంటే గంభీరమైన హృదయం కవికోకిల జాషువాది" అన్న మహాకవి దాశరథి మాటలు అక్షర సత్యాలు - అంతటి గంభీరమైన కవిలో దేశాభిమానానికీ కొదువలేదు. దేశాభిమానానికి పాదులు కన్నతల్లి నుండి పుట్టిన ఊరునుండీ పడ్డాయి. జాషువా దేశాభిమానం తల్లినుండి ఊరినుండి ప్రారంభం అయింది. తన తల్లి పుట్టిన ఊరైన వినుకొండను గూర్చి -

"కొడుకులమ్మ నిర్వాహకులనుజేసి/ మురిసికొని చంద్రశిలలీల గరిగినావు/ పుణ్యముతల్లి! నీ పాలపుష్టి కతన/
కవన బాలిక నా జిహ్వ నవతరించె."/ గౌడ డిండిమభట్టుని కంచుఢక్క/ పగులగొట్టించు కవి సార్వభౌమునిల్లు
భాస్కరుని కత్తి మెరసిన ప్రథనభూమి/ శిరము నెరసిన వినుకొండ సీమమాది."

అలాగే ఆంధ్రదేశం, ఆంధ్రభాష, సంస్కృతి పట్ల జాషువాకు గొప్ప అభిమానం. ఏడు సంపుటాలలో విస్తరించిన జాషువా ఖండకావ్యాలలో దాదాపు పాతిక ఖండి కలవరకు ఆంధ్ర దేశాభిమానం నిండిన ఖండికలు వున్నాయంటే జాషువా దేశాభిమానం ఎంతటిదో ఊహించుకోవచ్చు. జాషువా దేశాభిమానానికి పరాకాష్ట గబ్బిలం కావ్యం. గబ్బిలాన్ని కైలాసంలోని శివుని దగ్గరకు పంపేక్రమంలో తంజావూరు నుండి కైలాసానికి మార్గ నిర్దేశనం చేస్తూ రాష్ట్రంలోని ఆయా చారిత్రక స్థలాలవర్ణనలు చేయడం దేశాభిమానం వల్లనే. గబ్బిలం దేశారాధన కావ్యమని జాషువా స్వయంగా గ్రంథానికి రాసుకున్న విజ్ఞప్తిలో తెలియచేశారు. 1953లో వెలువడిన 'రాష్ట్రపూజ' కావ్యం ఆ కోవలోనిదే. దేశంపట్ల, దేశమాత భావన పట్ల జాషువా కవికి అత్యంత గౌరవ భక్తి ప్రపత్తులు. భరతమాత జేగీయ మానమైన చరిత్రను కవితాత్మకంగా యిలా గానం చేస్తున్నాడు.



"సగర మాంధాతాది షట్చక్రవర్తుల యంకసీమల నిల్చినట్టి సాధ్వి/ కమల నాభుని వేణుగాన సుధాంబుధి మునిగి తేలిన పరిపూత దేహ/ కాళిదాసాది సత్కవి కుమారుల గాంచి కీర్తినందిన పెద్ద గేస్తురాలు/ బుద్ధాది మునిజనంబుల తపంబున మోదబాష్పముల్విడిచిన భక్తురాలు/ సింధుగంగా నదీజల క్షీరమెపుడు/ కురిసి బిడ్డల బోషించుకొనుచునున్న/ పచ్చిబాలెంతరాలు మాభరతమాత/ మాతలకు మాత సకల సంపత్ సమేత"

అలాంటి దేశానికి పరదేశ పాలకుల నుండి ముప్పు ఏర్పడినపుడు దేశాభిమానంగల ఏ కవి కలం కదపకుండా వుంటాడు. పిరదౌసి కావ్యంలో, గజనీ మహమ్మదు దండయాత్రలో భారతీయ సంపద దోచుకొని భారతీయ దేవాలయాలు, శిల్పసంపద విధ్వంసం చేసినపుడు కవి -

భారత క్షోణి కల్గు దేవస్థలంబులు/ బెదరి గజనీ పురాన మసీదులయ్యె/ నిప్పటి మసీదు లే రూపమెత్తగలవో/ కాలమెరుగును, ధారుణీ గర్భ మెరుగు"- అని వేదన చెందుతాడు. జాషువాగారి ఈ పద్యం కవి క్రాంత దర్శి అన్న మాటలను వర్తమాన చరిత్ర రుజువుచేసి చూపించింది. జాషువా కవిలో దేశభక్తి, భారతమాత స్తుతి పరాకాష్టకు చెందిన కావ్యాలలో బాపూజీ, నేతాజీ, స్వరాజ్యబాల కావ్యాలు ముఖ్యమైనవి. తన అహింసా మార్గంలో బ్రిటీషు పాలకులకు ఎదురొడ్డి, స్వాతంత్ర్యాన్ని సముపార్జించి, జాతిపితగా కీర్తి పొందుతున్నారు. గాంధీజీ అంటే ఏకవికి మక్కువ వుండదు. దేశనాయకుల సిద్ధాంతాలను ప్రచారం చేయడం వారి అడుగుజాడల్లో నడవడం కూడా దేశాభిమానమే. జాషువా కవిత్వంలో కరుణ రసం ధర్మాగ్రహం ప్రధాన లక్షణాలు కావడానికి, జాషువాపై గాంధీ ప్రభావం కంఠదఘ్నంగా వుండటమే!

"కవి శక్రేశుడు గండ పెండరములన్ గాంగేయ తీర్థంబులన్/ వివిధోపాయన సత్కృతుల్ గొనిన గాంధీ శాంతి సిద్ధాంత మార్దవ మార్గాటుడ" నని "ఆడినమాట తప్పను, మహాత్ముని చెప్పుల జాడలోన కాలాడచరించెదన్ అనీ "నా కవచంబహింస, సహనంబు మహాయుధ, మొక్కిరింత ధర్మైకనిరూఢి/ సత్యమునియంత, అనంత జగత్తు మొత్తమై నా కెదురైన గెల్తును/ వినాశపు బాంబుల గుండె కాయలో బాకును, లోకమోహన/ సబర్మతి సన్మునికిన్ కుమారుడన్." - అని ప్రకటించుకున్న జాషువా తన కావ్యాల నిండా గాంధీ శాంతి సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. భరతమాత ఖండికలో "గౌనబు సిరిగల భాగ్య శాలివినీవు, భారతాంబమణి నమస్కారమమ్మ" (సెప్టెంబరు 28 జాషువా 129వ జయంతి) అంటూనే "ఐకమత్యము కలిగి నిన్ననుభవించు కొరత పూరింపవే మాకు" అనీ వేడుకుంటాడు. దేశం బానిసత్వం నుండి, పర పాలననుండి విముక్తం అయి స్వేచ్ఛావాయువులు పీల్చిన సందర్భంలోనూ అవధులులేని తన ఆనందాన్ని వ్యక్తంచేస్తాడు. స్వేచ్ఛాదినము అనే ఖండికలో.

"అపరంజి కురిసి మాకన్నంబు దినిపించు తల్లి భారతి నేడు దక్కె మాకు" అంటూ "అనసుభూత రసానంద జనితమైన చేతన జ్యోతి దిక్కుల చెంగలించి గోచరంబయ్యె మా నేత్రగోళములకు అచ్చమున భారతీయుడ నయితినేడు" - ఒక పక్క స్వాతంత్ర్యం సిద్ధించినందుకు సంతోషిస్తూనే, స్వాతంత్ర భారతంలో దళితుల స్థితిగతులు మెరుగవుతాయా అనే ఆందోళననూ వెలిబుచ్చాడు. "నన్ను తొలగించి లెక్కించినారుగాని మొదట నెల్లరము అన్నదమ్ములము మేము" - అని తాము ఈ దేశంలోని భాగమే అని గుర్తు చేస్తాడు. అంతేకాదు "స్వాతంత్ర్యమను సౌధంబున మా వాటా మాకిత్తురో... ఖాతాలేదని తోసిపుచ్చెదరో" అని సంశయాన్ని కూడ వ్యక్తం చేస్తాడు. స్వాతంత్ర్యవీరులు దేశనాయకులు, మరణించినపుడు వారిత్యాగాలను స్మరిస్తూ రాసిన ఖండికలు కూడా జాషువా దేశాభిమానానికి ప్రతీకలుగా భావించవచ్చు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మరణించినపుడు 'రత్నచ్యుతి' పేరుతో రాసిన పద్యాల్లో "దినముగడుచుట కింట బత్తెములేక నిత్యసంతర్పణములు నెరపు భక్తుడవు, ఆంధ్ర వైభవ ధ్వజమూడి యవని గూల, కూలిపోయెనె మా రత్నగోపకుండు" అని దుగ్గిరాలను ఆంధ్రవైభవ ధ్వజంగా కీర్తిస్తాడు. వివేకానందుని వక్తృత్వ పటిమను "గంగమాంబిక హిమవదగ్రమున నుండి, అవనికేగిన నాటి వేగాతిశయము, వానివాక్కున నిలిపి గుప్తంబుసేయ, సాటియెరుగని వక్తృ పంచాస్య మితడు" అంటాడు. నేతాజీ సుభాసు చంద్రబోసు మరణించాడన్న వదంతులు వ్యాపించిన సందర్భంలో "సుభాసు భాస్కర! ఉదయింపవే భరతఖండము, కోటి కరాలపూజలు నీ కొరకు తయారొనర్చె, గైయికొమ్ము, పొనర్పుము సింహనాదముల్" అని భరతావనికి ఆహ్వానిస్తాడు. డా॥ బి.ఆర్. అంబేద్కరు గురించి "పదికోట్ల దీనజాతుల హృదయ వ్యధను ఔదలంధరించిన నీవు కాలూనిన చోట సమత చిగురిస్తుంది. అని అంజలి ఘటిస్తాడు. విశ్వకవి రవీంద్రుని గూర్చిరాస్తూ 'అయిదు ఖండాలనేకల్మోడ్పు లందుకున్న విశ్వకవి రవీంద్రునిగన్న వీరభూమి మాది మాదని పల్కు దొమ్ములు గలవె అల అమెరికాకుగాని రష్యాకుగాని" ఇలా జాషువా కవిత్వంలో మాతృ అభిమానం, గ్రామాభిమానంతో మొదలయి, రాష్ట్రాభిమానం మీదుగా దేశాభిమానంగా రూపు దిద్దుకొంది. దేశాభిమానంతో తెలుగులో ఏ కవికీ తీసిపోని గొప్ప రచనలు చేసిన మహాకవి జాషువా స్మృతికి జయంతి నివాళులు.

(నేడు జాషువా జయంతి సందర్భంగా...)

ఫోన్: 848202526

పదేళ్లు గుర్తుకురాని మహిళా రిజర్వేషన్

ఎం కోటేశ్వరరావు

నాటకీయ పరిణామాల మధ్య నరేంద్రమోదీ సర్కార్ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో 33శాతం మహిళా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. అది చట్టం కావటం లాంఛనమే. సగం రాష్ట్రాలు ఆమోదిస్తే దాని అమలుకు బాటపడుతుంది. ఏ అసెంబ్లీ, లోక్‌సభ సెగ్మెంట్లలోని ఓటర్లలో పురుషులు ఎందరు, మహిళలు ఎందరు అనే వివరాలు ఇప్పటికే ఉన్నాయి గనుక కొందరు ఆ స్థానాలను ఉటంకిస్తూ అవన్నీ మహిళలకు రిజర్వు చేయనున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. అసలు ఈ రిజర్వేషన్లు ఎప్పుడు అమల్లోకి వస్తాయంటే 2029 నాటికి అని కొందరు, 2034 లేదా ఆ తరువాతే అని మరికొందరు భాష్యం చెబుతున్నారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజనలో ఏ రాష్ట్రంలో ఎన్ని సీట్లు పెరిగేదీ, ఎక్కడ ఎన్ని సీట్లు తగ్గేది కూడా ఉటంకిస్తున్నారు. తాజాగా ఆమోదం పొందిన బిల్లు ప్రకారం, రిజర్వేషన్లు పదిహేను సంవత్సరాలపాటు అమల్లో ఉంటాయి. షెడ్యూలు కులాలు, తరగతులకు నిర్దేశించిన సీట్లలో మూడోవంతు సీట్లను మహిళలకు కేటాయిస్తారు. వెనుబడిన తరగతుల మహిళలకు రిజర్వేషన్లు ఉండాలన్న డిమాండ్‌ను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక ఆమోదించిన బిల్లు చట్టమై ఎప్పటికి అమల్లోకి వస్తుంది, అసలు ఏం జరగబోతోంది ?

రాజ్యసభలో 2010లోనే ఆమోదం పొందిన రిజర్వేషన్ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందితే సరిపోతుంది. యూపీఏ ఏలుబడిలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న కొన్ని పార్టీల వ్యతిరేకత, అభ్యంతరాల కారణంగా అది లోక్‌సభలోకి రాలేదు. తమకు పూర్తి మెజారిటీవస్తే దాన్ని తక్షణమే ఆమోదిస్తామని బీజేపీ వాగ్దానం చేసింది. 2014, 2019లో అవసరమైన మెజారిటీ సగానికంటే ఎక్కువ రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలే ఉన్నందున ఆ బిల్లు ఆమోదానికి ఆటంకంలేదు. తొమ్మిదేండ్లుగా దాని ప్రస్తావనలేదు. అధికారానికి వచ్చిన వెంటనే ఆమోదంపొంది తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా 2011 జనాభా ప్రాతిపదికన ఉన్న సీట్లలోనే మహిళల కోటా అమలు జరిపేందుకు పునర్విభజనతో నిమిత్తం లేకుండా అవసరమైన రాజ్యాంగ సవరణచేసి ఉంటే అమల్లోకివచ్చి ఉండేది. కారణాలు ఏమైనప్పటికీ ముందురోజు కాబినెట్‌లో ఆమోదించి మరుసటిరోజు లోక్‌సభలో, తరువాత రాజ్యసభలో ఆమోదానికి పెట్టారు. లోక్‌సభలో ఇద్దరున్న మజ్లిస్ మినహా మిగిలిన పార్టీలేవీ వ్యతిరేకంగా ఓటు వేయలేదు. రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తరువాత లోక్‌సభ, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ ఈ పరిణామాన్ని ఎలా ఉపయోగించుకుంటుందో, జనానికి ఏం చెబుతుందో, ఓటర్లు ఎలా స్వీకరిస్తారో చూద్దాం. పదేండ్లకు ఒకసారిజరిగే జనగణన తరువాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాలన్నది స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జరిగిన నిర్ణయం. దీన్ని అమలు చేసేందుకు ఏర్పాటుచేసే కమిషన్‌కు ఒక విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షత వహిస్తారు. కేంద్ర ఎన్నికలసంఘం ప్రధాన అధికారి, రాష్ట్రాల ఎన్నికల అధికారులు ఉంటారు. దాని నిర్ణయాన్ని ఆమోదించటం తప్ప ఏ కోర్టులోనూ సవాలుచేసే అవకాశంలేదు. ఆ మేరకు 1952, 1963, 1973లో జరిగాయి.1973 తరువాత పాతికేళ్లపాటు ఆ ప్రక్రియను నిలిపివేస్తూ పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేశారు. ఆ మేరకు 2002లో మరో పునర్విభజన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. తరువాత మరో పాతికేండ్లపాటు 2026 వరకు అదే సంఖ్యను కొనసాగించాలని నిర్ణయించారు. తొలి లోక్‌సభలో 494 నియోజకవర్గాలుండగా, తరువాత పది సంవత్సరాలకు 522కు పెంచారు. మరో పదిసంవత్సరాల తరువాత 542కు పెంచారు. ఆప్రక్రియ తరువాత సిక్కిం మన దేశంలో విలీనం కావటంతో మరొక స్థానాన్ని దానికి కేటాయించటంతో 543 అయ్యాయి. వీటిలో పదమూడు కేంద్రపాలిత ప్రాంతాలనుంచి ఉన్నాయి. అప్పటి నుంచి 2026వరకు ఆ సంఖ్యలో ఎలాంటి మార్పు ఉండదు. మధ్యలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలలో కొన్ని ప్రాంతాలూ, అసెంబ్లీ సెగ్మెంట్లు అటూఇటూ అయ్యాయి. కొన్ని నియోజవర్గాలు రద్దు, కొన్ని కొత్తవి వచ్చాయి. తెలంగాణాలో జనాభా పెరగటంతో ఆంధ్రప్రాంతంలో సీట్లు తగ్గాయి. ఉమ్మడి రాష్ట్రాన్ని విభజించిన తరువాత ఎక్కడఉన్న సీట్లు అక్కడే ఉన్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణా సీట్లను 119 నుంచి 153కు, ఆంధ్రప్రదేశ్‌లో 175ను 225కు పెంచుతామని వాగ్దానం చేసినందున 2026 తరువాత జరిగే పునర్విభజన ప్రక్రియలో భాగంగా అవి అమల్లోకివస్తాయి.



2021లో జరగాల్సిన జనగణన వాయిదాపడింది. అది ఎప్పుడు జరుగుతుందో తెలియదు. గడువు ప్రకారం వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి వుంది. అందువలన జనగణన జరుగుతుందా, మరుసటి ఏడాదికి వాయిదా పడుతుందా అన్నది ప్రస్తుతానికి ఊహాగానమే. 2026లోపు జనగణన జరుగుతుందనే భావనతో తరువాత జరిగే పునర్విభజన ప్రకారం 2029 లోక్‌సభ ఎన్నికలు, గడువు ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33శాతం కేటాయించాల్సి ఉంటుందని అందువలన 2029లో అమలు జరుగుతాయని కొందరు భాష్యం చెబుతున్నారు. ఇక పార్లమెంటు ఆమోదించిన 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026 తరువాత జరిగే పునర్విభజన ప్రక్రియ జరగవచ్చు. అనేక రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ విధానాలను సక్రమంగా అమలు జరపకపోవటం, జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లను కేటాయిస్తున్నందున ఎక్కువ సీట్లు పొందేందుకు జనాభా అదుపును పట్టించుకోవటం లేదనే అభిప్రాయంఉంది. ఆ విషయాన్ని సూటిగా చెప్పకుండా 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 2000 సంవత్సరం వరకు నియోజకవర్గాలలో ఎలాంటి మార్పులు చేయకూడని నిబంధన పెట్టారు. తరువాత జనాభా స్థిరీకరణ అవుతుందనే అంచనాతో మరోసారి 84వ రాజ్యాంగసవరణ ద్వారా 2026 వరకు సీట్ల సంఖ్యలో మార్పులేకుండా నిర్ణయించారు. 2002లో ఏర్పాటుచేసిన కమిషన్ 1991 జనాభా ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని నిర్ణయించారు. కమిషన్ పనిచేపట్టిన తరువాత 2003లో 87వ రాజ్యాంగ సవరణ ద్వారా 2001 జనాభా ప్రాతిపదికను నిర్ణయించటంతో తిరిగి నూతన ప్రక్రియను చేపట్టాల్సి వచ్చింది. అది 2008వరకు పూర్తి కాలేదు. జమ్మూ-కాశ్మీర్‌లో జనగణన జరగకపోవడంతో దీన్నుంచి మినహాయించారు, అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ జనాభా లెక్కల్లో తేడాలు ఉన్నందున కోర్టు వివాదాల కారణంగా అక్కడ జరగలేదు. 2009 సాధారణ ఎన్నికల నాటికి 543కు గాను 499చోట్ల పునర్వ్యస్థీకరణ జరిగింది. పన్ను ఆదాయ పంపిణీకి పదిహేనవ ఆర్థిక సంఘం ఎంచుకున్న జనాభా ప్రాతిపదికతో ఎక్కువ మొత్తాలను జమచేస్తున్న దక్షిణాది రాష్ట్రాలు తక్కువ మొత్తాలను పొందుతూ వివక్షకు గురవుతున్నాయి. అంతకు ముందు 1971 జనాభా ప్రాతికగా ఉన్న కేటాయింపులను 2011కు మార్చటంతో పెద్ద తేడా వచ్చింది. దేశ జనాభాలో 18శాతం ఉన్న రాష్ట్రాలు జిడిపిలో 35శాతం సమకూర్చుతున్నాయి. రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించే వారు రాష్ట్రాలకు ప్రతినిధులుగా ఉండాలన్నది రాజ్యాంగ స్ఫూర్తి. కానీ 2003లో చేసిన సవరణతో ఎవరు ఎక్కడినుంచైనా ప్రాతినిధ్యం వహించవచ్చు. అలాంటి వారు ఆ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తారా ? అక్కడి సమస్యలను పట్టించుకుంటారా ? వచ్చే పునర్విభజనలో పాత జనాభా పద్ధతినే ఆమోదిస్తే దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గటం ఖాయం.

దారుణం...అమానుషం

సాయం కోరినా పట్టించుకోని సమాజం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో దారుణ విషాద ఘటన చోటుచేసుకుంది. 12 ఏళ్ల బాలికను ఓ కామాంధుడు అత్యాచారం చేసి...తీవ్రంగా గాయపరిచాడు. సాయం కోసం అర్థించినా ఎవరూ ముందుకు రాలేదు. నడిరోడ్డుపై అర్ధనగ్నంగా రక్తమోడుతూ ఇంటింటికెళ్లి తలుపు తడుతూ సాయం కోరిన ఓ చిన్నారిని ఆదుకోకపోగా చీదరించుకున్నారు. మధ్యప్రదేశ్ లోని ఉజ్జయినికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాద్‌నగర్ రోడ్డులో జరిగిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆన్‌లైన్‌లో కనిపించిన దృశ్యాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఈ వీడియోలో సుమారు 12 ఏళ్ల వయసున్న బాలిక అర్ధనగ్నంగా నడిరోడ్డుపై తిరుగుతూ ప్రతి ఇంటి తలుపు తడుతూ కనిపించింది. అప్పటికే ఆమె వ్యక్తిగత అవయవాల నుంచి రక్తం కారుతూ ఉంది. అత్యాచారానికి గురికావడం వల్లే ఆమెకు ఆ దుస్థితి తలెత్తింది. ఆమెను చూసి దిగ్భ్రాంతికి గురైనా... ఎవరూ సాయం చేయడానికి ముందుకు రాలేదు. ఆమె ఓ వ్యక్తి దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించగా... చీదరించుకొని పక్కకు వెళ్లిపొమ్మని సైగలు చేయడం కనిపించింది. దిక్కుతోచని ఆమె అలాగే నడుచుకుంటూ ఓ ఆశ్రమం ప్రాంగణంలోకి వెళ్లింది. అక్కడి నిర్వాహకులు అత్యాచారం జరిగిందని అనుమానించి, ఆమె ఒంటిపై టవల్ కప్పి స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు...ఆమెపై అత్యాచారం జరిగిందని ధ్రువీకరించారు. గాయాలు తీవ్రంగా ఉండటంతో ఆ బాలికను ఇండోర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రక్తస్రావం ఎక్కువగా ఉండటంతో... అక్కడున్న పోలీసులు రక్తదానానికి ముందుకువచ్చారని తెలుస్తోంది. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వైద్యపరీక్షల్లో ఆమెపై అత్యాచారం జరిగిందని నిర్ధారణ అయింది. నిందితులను సాధ్యమైనంత త్వరగా గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని, ఎవరికైనా ఈ ఘటనకు సంబంధించిన సమాచారం తెలిస్తే. తెలియజేయాలని కోరుతున్నామని ఉజ్జయిని పోలీస్ అధిపతి సచిన్ శర్మ తెలిపారు.

బాధితురాలు తన పేరు, చిరునామా వంటి వివరాలు స్పష్టంగా చెప్పలేకపోతోందని, ఆమె మాట్లాడుతున్న యాస ప్రకారం.. ఆమెది ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ అని భావిస్తున్నామని తెలిపారు. 2019 నుంచి 2021 మధ్యకాలంలో మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో అత్యధిక సంఖ్యలో మహిళలు, బాలికల అదృశ్యాలు నమోదైనట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. 2021లో మధ్యప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో అత్యాచార కేసులు నమోదయ్యాయి.

నితీశ్ ఆకస్మిక తనిఖీతో మంత్రులకు దడ

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సచివాలయానికి వెళ్లి తన మంత్రులు విధుల్లో ఉన్నారో లేరో స్వయంగా పరిశీలించారు. ఎక్కువ మంది మంత్రులు తమ కార్యాలయాల్లో లేకపోవడంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. నితీశ్ కుమార్ మరోసారి బీజేపీకి దగ్గరకానున్నారనే ఊహాగానాల మధ్య ఆయన సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జేడీయూ మెజారిటీ ఎమ్మెల్యేలు సకాలంలో తమ కార్యాలయాలకు రాగా, ఆర్జేడీ సహా ఇతర భాగస్వామ్య పార్టీల మంత్రులు రాకపోవడాన్ని సీఎం గమనించారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఆయన సెక్రటేరియట్‌కు చేరుకుని, వికాస్ భవన్, విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యాశాఖ మంత్రి చంద్రశేఖర్ కార్యాలయంలో లేకపోవడంతో మంత్రికి ఫోన్ చేయాలని ఒక అధికారిని ఆదేశించారు. టెలిఫోన్ సంభాషణల్లో 'నేను మీ కార్యాలయంలో ఉన్నాను. మీరెక్కడ ఉన్నారు' అని మంత్రిని నితీశ్ ప్రశ్నించారు. సకాలంలో కార్యాలయాలకు రావాలని సూచించారు. ఆ తర్వాత అదనపు చీఫ్ సెక్రటరీ కేకే పాఠక్ గురించి ఆరా తీయగా, ఆయన ఢిల్లీ వెళ్లినట్టు తెలిసింది. విద్యాశాఖకే చెందిన మరో అధికారి బైద్యనాథ్ వచ్చారో లేదో ఆరా తీయగా, ఆయన కూడా సకాలంలో కార్యాలయానికి రాలేదని గుర్తించారు. ఆరోగ్య శాఖ కార్యాలయానికి వెళ్లినప్పుడు అక్కడ అదనపు చీఫ్ సెక్రటరీ కూడా లేకపోవడం గమనించారు.

భారత్- కెనడా మధ్య చిచ్చుకు పాక్ కుట్ర?

న్యూఢిల్లీ: భారత్-కెనడా మధ్య ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ రాజేసిన చిచ్చు రోజు రోజుకీ నివురుగప్పిన నిప్పులా మారుతోంది. ఇదే సమయంలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన తాజా నివేదిక సంచలనం సృష్టిస్తోంది. భారత్, కెనడా మధ్య గొడవలు సృష్టించడానికి పాకిస్థాన్ కుట్రలు పన్నిందని నివేదిక తెలిపింది.

చాలా నెలల క్రితమే ఈ కుట్రకు సంబంధించి బ్లూ ప్రింట్ సిద్ధం చేసి హర్దీప్ హత్యకు ప్రణాళిక రచించింది. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ కెనడాలో ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను హతమార్చేందుకు భారత్, కెనడా మధ్య సంబంధాలను దెబ్బతీసేందుకు ఈ ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. నిజ్జర్‌ను చంపడానికి ఐఎస్ఐ నేరస్థులను నియమించిందని, రెండేళ్లలో కెనడా వచ్చిన గ్యాంగ్‌స్టర్‌లకు మద్దతు ఇవ్వమని హర్దీప్‌పై ఒత్తిడి తెచ్చిందని నిఘా వర్గాలు తెలిపాయి. అయితే నిజ్జర్ మాత్రం మాజీ ఖలిస్థానీయుల వైపే నిలిచారు. దీంతో అతడ్ని హత్య చేసి ఆ స్థానంలోకి ఐఎస్ఐ వెళ్లబోతోందని, కెనడాలో ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాదులను సమీకరించడానికి సిద్ధమవుతోందని తెలుస్తోంది. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారతీయ ఏజెంట్ల ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఇటీవల ఆరోపించిన తర్వాత రెండు దేశాల మధ్య దౌత్యపరమైన వివాదం చెలరేగింది. భారత్ ఆ వాదనను ఖండించినా వివాదం సద్దుమణగలేదు.

ఖాలిస్థానీ గ్యాంగ్‌స్టర్లపై

ఎన్ఐఏ ఉక్కుపాదం

ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో తనిఖీలు

న్యూఢిల్లీ: భారత్-కెనడా మధ్య దౌత్యపరంగా వివాదం సృష్టించిన ఖలిస్థానీ అంశంపై జాతీయ దర్యాప్తు సంస్థ దృష్టిపెట్టింది. ఖలిస్థాన్ సానుభూతిపరులు-గ్యాంగ్‌స్టర్ల మధ్య ఉన్న బంధం తెంచే పనిలోపడింది. దీనిలో భాగంగా ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. పంజాబ్, హరియాణా, ఢిల్లీ-ఎన్‌సీఆర్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌ల్లో 50 చోట్ల బుధవారం ఈ దాడులు జరిగాయి. భారత్‌లో నియమించుకొన్న వ్యక్తులకు ఇతర దేశాల్లోని ఖలిస్థానీలు-గ్యాంగ్‌స్టర్ల నుంచి హవాలా మార్గంలో డబ్బులు వస్తున్నాయని, వీటిని ఉపయోగించి వారు డ్రగ్స్, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నారని ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. వీరికి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ నుంచి సహకారం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే యూఏపీఏ కింద అరెస్టు చేసిన వారి నుంచి సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. తాజాగా బుధవారం పంజాబ్‌లో 30 చోట్ల, రాజస్థాన్‌లో 13, హరియాణాలో నాలుగు చోట్ల, ఉత్తరాఖండ్‌లో రెండు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కోచోట తనిఖీలు జరిగాయి. ఇప్పటికే భారత్ నుంచి పారిపోయి బ్రిటన్, కెనడా, దుబాయ్, పాకిస్థాన్ ఇతర దేశాల్లో ఆశ్రయం పొందుతున్న 19 మంది ఖలిస్థాన్ ఉగ్రవాదుల జాబితాను జాతీయ దర్యాప్తు సంస్థ విడుదల చేసింది. దీంతోపాటు హర్వీందర్ సింగ్ సంధు, లక్బీర్ సింగ్ సంధు పేరిట రూ.10 లక్షల చొప్పున రివార్డు ప్రకటించింది. వీరికి బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌తో సంబంధాలున్నాయి.

హింస, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న కెనడా

విదేశాంగ మంత్రి జయశంకర్ విమర్శ



న్యూయార్క్: భారత్ -కెనడా మధ్య ఉద్రిక్తతలపై విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కెనడా వ్యవస్థీకృత నేరం, వేర్పాటువాద శక్తులు, హింస, ఉగ్రవాదాలను కెనడా ప్రభుత్వం పెంచి పోషిస్తోందని ఎస్. జయశంకర్ విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం వాటిని అనుమతిస్తోందన్నారు. భారత దౌత్యవేత్తలకు బెదిరింపులు, ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయాలపై దాడుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఐరాస సాధారణ సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన న్యూయార్క్‌లో జరిగిన 'డిస్కషన్ ఎట్ కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్'లో ఈ వివాదంపై మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలలో వేర్పాటువాదశక్తులు, వ్యవస్థీకృత నేరాలు, హింస, ఉగ్రవాదానికి సంబంధించిన ఘటనలను కెనడా చూసింది. అవన్నీ దేశంలో భాగంగా కొనసాగుతున్నాయి. కానీ వాస్తవానికి భారత్ ప్రత్యేకమైన, సమాచారం గురించి మాట్లాడుతోంది. వ్యవస్థీకృత నేరాల గురించి కెనడాకు భారత ప్రభుత్వం చాలా సమాచారం అందించింది. కొంతమంది వ్యక్తులను అప్పగించాల్సిందిగా అభ్యర్థనలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. అక్కడ ఉగ్రవాదులు, వేర్పాటువాదులు ఉన్నారు. వారిని గుర్తించామని ఆయన అన్నారు. అయితే రాజకీయ లబ్ధి కోసం వాటిని కెనడా ప్రభుత్వం అనుమతిస్తోందనేది తమ ఆందోళన అని అన్నారు. దీంతో దౌత్యవేత్తలపై బెదిరింపులు, రాయబార కార్యాలయాలపై దాడులు జరిగాయి. వాటిలో చాలా వరకు అక్కడి ప్రభుత్వం సమర్థిస్తున్నప్పుడు, ప్రజాస్వామ్య పనితీరుపై సందేహం వ్యక్తమౌతోందని అన్నారు. ఒక విషయం గురించి తనకు సమాచారం అందినపుడు ప్రభుత్వపరంగా దానిని పరిశీలిస్తామని కెనడా ఆరోపణలపై స్పందించారు. కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలపై స్పందిస్తూ ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ నిజ్జర్ హత్యకు సంబంధించి కెనడా ప్రభుత్వం తమకు సమాచారం అందిస్తే... భారత ప్రభుత్వం కచ్చితంగా చర్య తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఫైవ్‌ఐస్ కూటమిలో పంచుకున్న సమాచారం ఆధారంగానే ట్రూడో ఆ ఆరోపణలు చేసి ఉండవచ్చన్న అమెరికా దౌత్యవేత్త వ్యాఖ్యలపై ఈ వివాదం మరింత తీవ్రమైన సంగతి తెలిసిందే. దీనిపై మీడియా ప్రశ్నకు స్పందిస్తూ తాను ఆ ఫైవ్ ఐస్‌లో భాగం కాదని, ఎఫ్‌బీఐకి చెందిన వ్యక్తిని కూడా కాదని అన్నారు. ఈ ప్రశ్న అడగాల్సింది తనని కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీతో పొత్తు తర్వాత

జేడీ(ఎస్) లౌకిక పార్టీనా?

కర్నాటక సీఎం సిద్ధరామయ్య

చామరాజనగర్ : మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జేడీ(ఎస్)పై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం విరుచుకుపడ్డారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీతో ఎన్నికల పొత్తు పెట్టుకున్న తర్వాత తమను తాము లౌకిక పార్టీగా పిలవకూడదని న్యూఢిల్లీలో హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో తమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి (గౌడ కుమారుడు) భేటీ అయిన తర్వాత జేడీ(ఎస్) శుక్రవారం బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించుకుంది. ఇప్పుడు ఎన్నికల కోసం బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. వారిని ఏమని పిలవాలి? ఈ జిల్లాలోని కొనసకెరెలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు సిద్ధరామయ్య సమాధానమిచ్చారు. 'పేరు సెక్యులర్ అంటుంది. వారు ఇప్పుడు సెక్యులర్‌గా ఉన్నారా? వారు చెప్పేది మనం అంగీకరించాలా? మతతత్వ పార్టీతో వెళ్లిన తర్వాత కూడా సెక్యులర్‌గా ఉంటారా? మనం అంగీకరించాలా? వారిని బీజేపీతో వెళ్లనివ్వండి లేదా మాకు అభ్యంతరం లేదు. కానీ వారు సెక్యులర్ అని చెప్పకూడదు, అంతే. జనతాదళ్ సెక్యులర్ పార్టీ అని వారు అనకూడదు' అని సీఎం అన్నారు. జేడీ(ఎస్) అంతకుముందు జనవరి 2006 నుంచి 20 నెలలు, మే 2018 నుంచి 14 నెలల పాటు కుమారస్వామి ముఖ్యమంత్రిగా బీజేపీ, కాంగ్రెస్ రెండింటితో కలిసి సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. అంతకుముందు, దేవెగౌడ తమతో పొత్తు పెట్టుకోవడం ద్వారా జేడీ(ఎస్) బీజేపీకి 'బి-టీమ్' అని నిరూపించిందని ఆరోపించినందుకు కుమారస్వామి కాంగ్రెస్ నాయకులపై ధ్వజమెత్తారు. షా ఆహ్వానం మేరకే తాను బిజెపితో వెళ్లానా అని అన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో కాకుండా బీజేపీతో వెళ్లి ఉంటే ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని నడపగలిగి ఉండేవారమని అన్నారు. దేశవ్యాప్తంగా లౌకిక శక్తులను కాంగ్రెస్ 'నాశనం' చేస్తోందని ఆరోపించిన కుమారస్వామి, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న తర్వాత వారు జేడీ(ఎస్) ని 'అంతం' చేసేందుకు కూడా ప్రయత్నించారని అన్నారు. జేడీ(ఎస్) సిద్ధరామయ్యను పార్టీ నుంచి బయటకు పంపలేదని పేర్కొన్న కుమారస్వామి, 2004లో అప్పటి బీజేపీ నాయకుడు ఎం.వెంకయ్య నాయుడుతో చెన్నైలో అవగాహన కుదుర్చుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధరామయ్య ప్రయత్నించారని కుమారస్వామి ఆరోపించారు. అయితే దీనిపై సిద్ధరామయ్య స్పందిస్తూ, 'నేను వెంకయ్య నాయుడుని కలవలేదు. నేను ఎల్.కె.అద్వానీని కలిసిన మాట వాస్తవమే. అద్వానీ (అంతకుముందు) జనతా పార్టీలో ఉన్నారు. ఆ విధంగా నాకు ఆయన గురించి తెలుసు. నేను ఆయనను కలిశాను' అని చెప్పారు.

మా పార్టీని కాపాడుకోవడమే లక్ష్యం

జేడీ(ఎస్) అధినేత దేవెగౌడ



బెంగళూరు : 2024 లోక్‌సభ ఎన్నికలకు బీజేపీతో పొత్తు పెట్టుకోవాలనే నిర్ణయాన్ని జేడీ(ఎస్) అధినేత హెచ్‌డీ దేవెగౌడ బుధవారం సమర్థించుకున్నారు. పార్టీని కాపాడడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, తమ పార్టీ లౌకిక ప్రమాణాలకు కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. మైనారిటీలను ఎప్పుడూ నిరాశపరచ లేదన్నారు. జేడీ(ఎస్) కి అధికార దాహం లేదని, అవకాశవాద రాజకీయాలు చేయదని మాజీ ప్రధాని స్పష్టం చేశారు. 'మేము (జేడీఎస్) మా లౌకిక ప్రమాణాలను కొంచెం కూడా వదులుకొని రాజకీయాలు చేయలేదు. భవిష్యత్తులో కూడా చేసే ప్రశ్నే లేదు. నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను. కుమారస్వామి బీజేపీ నేతలను కలవడానికి ముందు, నేను కేంద్ర హోం మంత్రి (అమిత్ షా) ని కలిశాను. అందులో దాచడానికి ఏమీ లేదు. కర్నాటక రాజకీయాల పరిస్థితులపై ఆయనతో వివరంగా మాట్లాడాను' అని దేవెగౌడ చెప్పారు. ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల రాజకీయ పోరాటంలో తమ పార్టీ నుంచి ఏ వర్గానికీ అన్యాయం జరగలేదని, ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. 'మీడియాతో సహా నేను దానిని స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. మేము అధికారం కోసం ఆకలితో ఉన్న రాజకీయ నాయకులం కాదు. షాతో ప్రాథమిక చర్చ తర్వాత, నేనే (కుమారస్వామిని ముందుకు సాగాలని) అడిగాను' అని అన్నారు. గత 10 సంవత్సరాలలో కేంద్ర హోం మంత్రి షాతో తాను జరిపిన మొదటి సమావేశం అని పేర్కొన్న గౌడ, 'ప్రధాన మంత్రి బిజీగా ఉన్న వ్యక్తి, నేను ఎందుకు (అతన్ని డిస్టర్బ్ చేయాలి)? ఈ విషయంపై నేను నేటికీ ప్రధాని నరేంద్ర మోదీని కలవలేదు. కర్నాటకలో రాజకీయ పరిస్థితులను షాకు వివరించిన తర్వాత, పార్టీకి నాయకత్వం వహిస్తున్న నా కొడుకును పంపుతానని చెప్పాను' అని అన్నారు. నిర్ణయం తీసుకునే ముందు కూడా మా పార్టీకి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎమ్మెల్సీలు, ఓడిపోయిన అభ్యర్థులతో సంప్రదింపులు జరిపామని, బీజేపీతో అవగాహన ఏంటో ఆలోచించాలని చర్చించిన తర్వాత వారి అభిప్రాయమని చెప్పారన్నారు. బీజేపీతో పొత్తుకు పార్టీ కార్యకర్తల నుంచి ఎలాంటి ప్రతిఘటన లేదని పేర్కొన్న గౌడ, జేడీ(ఎస్) అధికార దాహంతో కూడిన పార్టీ కాదని, కాంగ్రెస్‌పై విరుచుకుపడి కుమారస్వామి (కాంగ్రెస్-జేడీ(ఎస్) ప్రభుత్వం పతనానికి ఎవరు కారణమని ప్రశ్నించారు. దాని వెనుక గేమ్ ప్లాన్ ఏమిటి? ఈ విషయం కాంగ్రెస్ నాయకత్వానికి తెలియదా?. రాహుల్ గాంధీ వచ్చి దేవెగౌడ బీజేపీకి 'బి-టీమ్' అని చెప్పారు. ఇది నాకు (కాంగ్రెస్) ఇచ్చిన సర్టిఫికెట్' అని ఆయన అన్నారు. 'దశాబ్దాలుగా తన బాధ, పోరాటమే ఈ పార్టీని కాపాడాలి, ఇందులో ఎలాంటి స్వార్థం లేదు. నేను నిర్ణయం తీసుకున్నాను' అని తెలిపారు.

అదానీ పోర్టుల 195 మిలియన్ డాలర్ల బాండ్ల బైబ్యాక్

న్యూఢిల్లీ: 'అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్' 195 మిలియన్ డాలర్ల రుణాన్ని ముందస్తుగా చెల్లించేందుకు సిద్ధమైంది. 2024 వరకు గడువు ఉన్నప్పటికీ ముందుగానే చెల్లించాలని నిర్ణయించింది. తద్వారా అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత ఇన్వెస్టర్లలో సన్నగిల్లిన విశ్వాసాన్ని చూరగొనేందుకు అదానీ గ్రూప్ అనేక చర్యలు చేపడుతోంది. 195 మిలియన్ డాలర్ల విలువ చేసే బాండ్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన ఫైలింగ్‌లో అదానీ పోర్ట్స్ వెల్లడించింది. కంపెనీ వద్ద ఉన్న నగదు నిల్వల ద్వారా ఈ చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొంది. బైబ్యాక్ టెండర్ అక్టోబర్ 26 వరకు ఓపెన్‌గా ఉంటుందని తెలిపింది. మొత్తం 520 మిలియన్ డాలర్ల అసలు చెల్లించాల్సి ఉంది. తాజా చెల్లింపుల తర్వాత 325 మిలియన్ డాలర్ల బకాయి మిగిలి ఉంటుందని కంపెనీ తెలిపింది. అదానీ పోర్ట్స్ గతంలోనూ 130 మిలియన్ డాలర్ల విలువ చేసే బాండ్లను కొనుగోలు చేసింది. వాటి గడువు 2024 జులై వరకు ఉన్నప్పటికీ ముందుగానే చెల్లించేసింది. మిగిలిన మొత్తాన్ని 20 శాతం చొప్పున రాబోయే నాలుగు త్రైమాసికాల్లో పూర్తి చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగానే తాజాగా రెండో విడత కింద 195 మిలియన్ డాలర్ల చెల్లింపులు చేయనుంది.

మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తత

ఇంఫాల్‌లో సీఎం ఇంటి ముట్టడికి విద్యార్థుల యత్నం
చెదరగొట్టిన పోలీసులు...అనేకమందికి గాయాలు
చురచంద్‌పూర్‌లో మహిళల భారీ ప్రదర్శన

ఇంఫాల్: మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇద్దరు విద్యార్థుల హత్యలను నిరసిస్తూ... రాజధాని ఇంఫాల్‌లో వరుసగా రెండోరోజు నిరసనలు మిన్నంటాయి. వేలాది మంది విద్యార్థులు బుధవారం మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ నివాసం వైపు దూసుకురావడంతో... రాష్ట్ర పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సహా భద్రతా బలగాలు గుంపును చెదరగొట్టడానికి బాష్పవాయువు గోళాలు, పొగ బాంబులను ప్రయోగించాయి. దీంతో అనేకమందికి గాయాలయ్యాయి. సీఎం సచివాలయానికి 200 మీటర్ల దూరంలో ఉన్న మొయిరాంగ్‌ఖోమ్ వద్ద రాళ్లదాడి చేస్తున్న గుంపును చెదరగొట్టడానికి భద్రతా బలగాలు అనేక రౌండ్ల బాష్ప వాయువు గోళాలను ప్రయోగించాయని అధికారులు తెలిపారు. హౌగ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు 'మాకు న్యాయం కావాలి' అని నినదిస్తూ... ముఖ్యమంత్రి బీరెన్ ఎన్ సింగ్ బంగ్లా వైపుకు కదిలారని అధికారులు తెలిపారు. ర్యాలీకి నాయకత్వం వహించిన విద్యార్థి నాయకుడు లాంటెంగ్బా విలేకరులతో మాట్లాడుతూ... 'ఇద్దరు విద్యార్థులను హత్య చేసినవారిని 24 గంటల్లో అరెస్టు చేయాలని, వారి మృతదేహాలను స్వాధీనం చేసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాము. మా డిమాండ్లను పరిష్కరించేందుకు మేము ముఖ్యమంత్రిని కూడా కలవాలనుకుంటున్నాము. మా స్నేహితులు దారుణంగా హత్య గురయితే మేము మా చదువును కొనసాగించగలమా.' అని పేర్కొన్నారు. కాగా ముఖ్యమంత్రి, గవర్నర్‌ను కలిసేందుకు విద్యార్థి ప్రతినిధులను అనుమతించేలా ఏర్పాట్లు చేస్తున్నామంటూ పోలీసులు ప్రకటించి విద్యార్థుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు ప్రయత్నించారు.

అయితే కొంతమంది విద్యార్థులు రాళ్లు రువ్వడంతో పరిస్థితి అకస్మాత్తుగా అధ్వానంగా మారడంతో వారిని చెదరగొట్టడానికి పోలీస్ సిబ్బందితో సహా భద్రతా బలగాలు అనేక రౌండ్ల పాటు బాష్పవాయువు గోళాలను ప్రయోగించాల్సి వచ్చింది అధికారులు తెలిపారు. తోటి విద్యార్థులను కిడ్నాప్ చేసి చంపడాన్ని నిరసిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని, ప్రతి ఒక్కరూ నల్లబ్యాడ్జీలు ధరించాలని కోరామని విద్యార్థి నాయకుడు తోక్‌చొమ్ ఖోగేంద్ర సింగ్ తెలిపారు. మరోవైపు మణిపూర్‌లో దాదాపు ఐదు నెలలుగా ఆదివాసీలపై జరిగిన హత్యలు, అత్యాచారాలపై సీబీఐ విచారణకు ఆదేశించడంలో జాప్యానికి వ్యతిరేకంగా కుకీ వర్గానికి చెందిన ఆదివాసీ గిరిజన నాయకుల ఫోరం (ఐటీఎల్ఎఫ్) మహిళా విభాగం చురచంద్‌పూర్‌లో ప్రదర్శన నిర్వహించింది. కాగా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముందుగానే ఇంఫాల్ అంతటా పోలీసు, సీఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ దళాలను మోహరించారు. చురచంద్‌పూర్‌లో నిరసనలకు నాయకత్వం వహించిన ఐటీఎల్ఎఫ్ మహిళా విభాగం కన్వీనర్ మేరీ జోన్ మాట్లాడుతూ... కుకీల హత్యలు, అత్యాచారాలపై సీబీఐ విచారణ ఎందుకు ప్రారంభించలేదని ఆశ్చర్యపోయారు. తమ వర్గానికి చెందిన గిరిజన మహిళలపై అత్యాచారాలు, నగ్నంగా ఊరేగించడం, మా పురుషులను చంపిన సంఘటనలు చాలా ఉన్నాయి కానీ సీబీఐ విచారణ ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. 'మాపై ఎందుకు ఈ పక్షపాతం? గిరిజనులపై జరిగిన హింసాత్మక ఘటనలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నాం' అని ఆమె అన్నారు. వేలాది మంది మహిళలు పాల్గొన్న ఈ ర్యాలీ లంకా పబ్లిక్ గ్రౌండ్‌లో ప్రారంభమై... తిపైముఖ్ రోడ్, ఐబీ రోడ్ మీదుగా వాల్ ఆఫ్ రిమెంబరెన్స్ వద్దకు చేరుకుంది. మంగళవారం కూడా ఇంఫాల్‌లో విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించడం, లాఠీచార్జి చేయడంతో 45 మంది గాయపడ్డారు. రాష్ట్రంలో జులైలో గల్లంతైన ఇద్దరు యువకులు హత్యకు గురైనట్లు తాజాగా వెల్లడయింది. దీనికి నిరసనగా మంగళవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. నిరసనకారులలో ఎక్కువగా విద్యార్థులు గాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పాఠశాలలకు సెలవు ప్రకటించినప్పటికీ, ఇంఫాల్‌లోని కొన్ని విద్యాసంస్థల విద్యార్థులు తమ పాఠశాలల వద్ద సమావేశమవుతామని ప్రతిజ్ఞ చేశారు. కాగా ఘర్షణల తర్వాత తప్పుడు పుకార్లు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1 రాత్రి 7.45 గంటల వరకు ఇంటర్నెట్, మొబైల్ సేవలపై నిషేధాన్ని తిరిగి విధించింది. మణిపూర్ జాతుల ఘర్షణ ప్రారంభమైనప్పుడు మే 3న నాలుగు నెలలకు పైగా ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించిన ప్రభుత్వం... ఇటీవలే దీనిని ఎత్తివేసింది. మిలాద్ ఉన్-నబీ (మహమ్మద్ ప్రవక్త జయంతి) దృష్ట్యా సెప్టెంబర్ 28న ప్రభుత్వ సెలవు దినం కాగా... శాంతిభద్రతల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 27, 29 తేదీలలో పాఠశాలలకు సెలవు ప్రకటించింది.

ఇంఫాల్‌కు సీబీఐ ప్రత్యేక బృందం

న్యూఢిల్లీ: ఇంఫాల్‌లో జులై6న ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్, హత్యకు గురైన ఘటనపై దర్యాప్తు చేయడానికి సీబీఐ స్పెషల్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్ నేతృత్వంలోని అధికారుల బృందం బుధవారం ప్రత్యేక విమానంలో ఇంఫాల్‌కు బయలు దేరినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.ఈ కేసును మణిపూర్ ప్రభుత్వం సీబీఐకి అప్పగించిన కొద్ది గంటల్లోనే దర్యాప్తు సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బృందంలో ఇప్పటికే ఇంఫాల్‌లో ఉన్న జాయింట్ డైరెక్టర్ ఘనశ్యామ్ ఉపాధ్యాయ్ కూడా ఉంటారని ఆ వర్గాలు తెలిపాయి. ఇందులో సీబీఐకి చెందిన ఎలైట్ సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ నిపుణులు కూడా ఉంటారని పేర్కొన్నాయి. ఈ కేసును ఇప్పటికే సీబీఐకి అప్పగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది.

అసమర్థ సీఎంను బర్తరఫ్ చేయాలి: ఖడ్గే



న్యూఢిల్లీ: మణిపూర్ లో అశాంతిపై, సామాన్యుల హత్యలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే... ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. అసమర్థ మణిపూర్ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ లో హింసకు మహిళలను, చిన్నారులను ఆయుధాలుగా మార్చుకున్నారని, ఈశాన్య రాష్ట్రాన్ని బీజేపీ రణరంగంగా మారుస్తోందని ఆరోపించారు. '147 రోజులుగా, మణిపూర్ ప్రజలు తీవ్రంగా బాధపడుతున్నారు. కానీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మణిపూర్ రాష్ట్రాన్ని సందర్శించడానికి సమయం దొరకడం లేదు. ఈ హింసాత్మక ఘటనల్లో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటున్న భయానకమైన సంఘటనలు మరోసారి యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేశాయి' అని మల్లికార్జున ఖడ్గే 'ఎక్స్'లో పోస్టు చేశారు. అందమైన మణిపూర్ రాష్ట్రం రణరంగంగా మారడానికి కారణం బీజేపీయేనని ఖడ్గే విమర్శించారు. మణిపూర్ లో మరింత హింస జరగకుండా ఉండటానికి అసమర్థ ముఖ్యమంత్రిని తొలగించాలని, అశాంతిని నియంత్రించడానికి అదో ముందడుగు అవుతుందని ఖడ్గే హితవు పలికారు.

నవరత్నాల్లో భూపంపిణీ చేర్చాలి

- జల్లి విల్సన్ డిమాండ్ • ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సక్రమంగా అమలు జరపాలి • దళితులపై దాడులు అడ్డుకోవాలి
- వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర మహాసభ తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల:
రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ బంజరు భూములను పేదలకు పంపిణీ చేయడంతో పాటు కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. ప్రతి పేదవాడికి ఒక హెక్టార్ సాగుభూమి ఇవ్వాలన్నారు. నవరత్నాల్లో భూ పంపిణీ కార్యక్రమం చేపట్టా లని కోరారు. ఇక్కడ జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్రమహాసభల్లో ఈ మేరకు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మహాసభ ఆమోదించింది. ఈ తీర్మానంలో అనేక విషయాలను విల్సన్ ప్రస్తావిస్తూ భూములు పై ఆరుగాలం శ్రమిస్తూ జీవనం భృతి పొందుతూ ఆహార ఉత్పత్తులకు కారుకులైన గ్రామీణ కష్టజీవులకు సాగుభూములు పంపిణీ చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి రాకపోవడం శోచనీయం అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు దున్నేవారికి భూమి నినాదంతో భూ పంపిణీ కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేయడం వల్ల నేడు లక్షల ఎకరాలు పేదలు సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారని తెలిపారు సుదీర్ఘ పోరాట ఫలితంగా 1975లో భూ గరిష్ట పరిమితి చట్టం అమల్లోకి వచ్చిందన్నారు వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు అప్పటి ప్రభుత్వాలు భూ పంపిణీ చేయించాయని తెలిపారు. ఇంకా లక్షల ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని భూమిలేని పేదలకు పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల పేదల భూములను అంగబలం, అర్థ బలం కలిగిన వారి చేతుల్లోకి వెళ్లిపోయాయని వాటిని తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు, భూ పరిమితి చట్టం ఊసే లేకుండా 2005లో ప్రభుత్వం కోనేరు రంగారావు కమిటీని ఏర్పాటు చేసిందని 104 సిఫారసులు చేస్తే ప్రభుత్వం 74 సిఫారసు లను ఆమోదించిందన్నారు. వాటిని ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో తీసుకున్న భూములకు బదులుగా భూమికి భూమి ఇవ్వాలనీ, నిరుపేద నిర్వాసితులకు కూడా భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పక్షాలతో గతంలో లాగే అసైన్‌మెంట్ కమిటీలను నియమిం చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కా రం కోసం వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, కార్మికులు ఉద్యమానికి సమయత్వం కావాలని పిలుపునిచ్చారు. వీటితో పాటు ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో సక్రమంగా నిధులు కేటాయించి ఖర్చు చేయాలని మరో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. దళితులపై దాడులను ఆపాలని ఎస్టీ ఎస్టీ సబ్‌ప్లాన్ సక్రమంగా అమలు జరగాలని మరో తీర్మా నాన్ని మహాసభ ఆమోదించింది. అదేవిధంగా అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006ను సక్రమంగా అమలు చేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు కల్పించాలని, రాష్ట్రంలో కరువు పరిస్థితులు-వలసల నివారణపై తక్షణమే చర్యలు తీసుకోవాలనీ, జగనన్న కాలనీల్లో పక్కా గృహాల నిర్మా ణాలు తక్షణమే చేపట్టాలనీ, ఆహార భద్రత పేదలందరికీ కల్పించాలని కోరుతూ తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ముందస్తు బెయిలివ్వండి

ఐఆర్ఆర్ కేసులో హైకోర్టును ఆశ్రయించిన నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

ఐఆర్ఆర్ (ఇన్నర్ రింగ్ రోడ్) అలైన్‌మెంట్ కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో లోకేశ్‌ను ఏ14గా చేరుస్తూ ఏసీబీ కోర్టులో సీఐడీ మెమో దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతో లోకేశ్ హైకోర్టులో తనపై అక్రమంగా కేసు నమోదు చేశారంటూ ముందస్తు బెయిల్ కోరారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్ వ్యవహారంపై గత ఏడాది నమోదు చేసిన కేసులో ఆయన పేరును తాజాగా సీఐడీ చేర్చింది. ఈ మేరకు విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో సీఐడీ అధికారులు మంగళవారం మెమో సమర్పించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ కేసులో ప్రస్తుతం జ్యుడిషియల్ రిమాండులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబుపై కూడా ఇన్నర్ రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్ కేసులో సీఐడీ అధికారులు పీటీ వారంట్ దాఖలు చేశారు. దానిపై విచారణ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ దశలో అదే కేసులో ఇప్పుడు లోకేశ్‌నూ నిందితుడిగా చేర్చారు. చంద్రబాబు అరెస్ట్ తర్వాత యువగళం పాదయాత్రను తాత్కాలికంగా నిలిపేసిన లోకేశ్ ఈ యాత్రను ఆగినచోటి నుంచే ఈ నెల 29న మళ్లీ మొదలుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో ఇప్పటికిప్పుడు తనను నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేసేందుకు సీఐడీ హడావుడి చేస్తోందని లోకేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

జగన్‌కు ప్రజలు బుద్ధిచెబుతారు

టీడీపీ ర్యాలీకి రామకృష్ణ సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:
టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ అనంతపురం అర్బన్ పరిధిలోని రుద్రంపేట బైపాస్ నుండి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం వరకు బుధవారం భారీ ర్యాలీ జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు అరెస్టును అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. జగన్ మూర్ఖత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని పేర్కొన్నారు. చంద్రబాబును అరెస్టు చేసి జగన్ పెద్ద తప్పు చేశారని చెప్పారు. తప్పును సరిదిద్దుకోవాలని సీఎం జగన్‌కు హితవు పలికారు. చంద్రబాబు సహా టీడీపీ, ఇతర ప్రతిపక్ష పార్టీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎవరు తప్పు చేసినా విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. జగన్ దుర్మార్గపు పాలన ఎక్కువకాలం నడవదని చెప్పారు. జగన్ వ్యవహారం తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అన్న చందంగా ఉందనిచ మారకపోతే ప్రజలు గద్దె దింపడం ఖాయమని హెచ్చరించారు.

ఉద్యోగులకు జీపీఎస్సే

- ఉభయ సభల్లో బిల్లు ఆమోదం
- ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి బుగ్గన స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఇక జీపీఎస్సే అమలు కానుంది. ఆ మేరకు ఉభయసభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ప్రతిపక్ష టీడీపీ వర్షాకాల శాసనసభ సమావేశాలను బహిష్కరించడంతో బిల్లులపై చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. శాసనసభ చివరి రోజు సమావేశాల్లో బుధ వారం గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) బిల్లును టేబుల్ అజెండా ఐటెంగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

సీపీఎస్‌ను సమీక్షించాలని ఉద్యోగులు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారని, దీనిపై మంత్రులు, అధికారులు కమిటీ చాలా అంశా లను పరిశీలించి జీపీఎస్‌ను రూపొందించిందని తెలిపారు. అనేక విడతలుగా ఉద్యోగులతో చర్చిం చిన తర్వాత జీపీఎస్‌ను ఓ హైబ్రీడ్ మోడల్‌గా కేబినెట్ ఆమోదించిందని చెప్పారు. ఉద్యోగులంతా ప్రభుత్వంలో ముఖ్యమైన భాగమని, ప్రభుత్వాన్ని కాపాడుకోవటంలో ఉద్యోగులు కీలకంగా నిలవాలన్నారు. జీపీఎస్‌ను చట్టంగా రూపొందించేందుకు శాసనసభలో ప్రవేశపెట్టామని మంత్రి వెల్లడించారు. మనసా వాచా కర్మణా ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఉద్యోగులకు బాధ్యతగా అర్హమైన, న్యాయమైన జీపీఎస్ ప్రభుత్వం అందించనుందని, పాలనలో ఉద్యోగులదే ముఖ్య భూమిక అన్నారు. అందుకే 11వ పీఆర్సీ అమలు చేయడానికి ముందు మధ్యంతర భృతి అందించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంపు చేశాంమని, సెలవు విషయంలో ప్రత్యేక సౌలభ్యం కల్పించామని చెప్పారు. చైల్డ్ కేర్ లీవ్ ను 60 రోజులు నుంచి 180 రోజుల వరకూ పెంచడంతోపాటు రిస్క్ లో పని చేసే నర్సులు సహా కొంత మందికి స్పెషల్ క్యాజువల్ 7 రోజులు ఎక్కువ చేశాం. కుష్ఠు, క్యాన్సర్, మానిసిక వ్యాధుల వంటి కొన్నింటి బారిన పడినవారికీ ఎక్స్ గ్రేషియా ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. ఉద్యోగి అకాల మరణం చెందితే 'ఫ్యామిలీ పెన్షన్' అందిస్తున్నాం. అలాగే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ , డైలీ వేజ్ జీతభత్యాలు 01,జనవరి,2022 నుంచి గణనీయంగా పెంపు చేశాం. 2, జూన్ 2014కు ముందు నుంచి కాంట్రాక్ట్‌లో ఉన్న మొత్తం 10,117 మందిని రెగ్యులరైజ్ చేయనున్నా మని మంత్రి వివరించారు. దాదాపు 53వేల మందికిపైగా ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలోకి విలీనం చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అలాగే 14,650 మంది అటానమస్ బాడీలో ఉండి పని చేసే వైద్యవిధాన పరిషత్ వారిని కూడా డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ లో చేర్చి రెగ్యులరైజ్ చేశామని తెలిపారు. ఇక 43 వేల మంది ఆశా వర్కర్లకు వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు, 28,815 మంది ట్రైబల్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, మున్సిపల్ ఔట్ సోర్స్ హెల్త్ వర్కర్లకు రూ.18 వేలకు, మెప్మా రీసోర్స్ పర్సన్‌లకు రూ.5వేల నుంచి రూ.10వేలకు, సెర్ప్ విలేజ్ ఆర్గనైజేష న్స్‌కు రూ.2వేల నుంచి రూ.10వేలకు, 16వేల మంది హోంగార్డులకు రూ.18 వేల నుంచి రూ.21,300కు, 48,770 మంది అంగన్ వాడీ వర్కర్ల కు రూ.7 వేల నుంచి రూ.11,500కు, 55వేల మంది అంగన్ వాడీ హెల్పర్లకు రూ.4వేల నుంచి రూ.7వేలకు, 108 వాహనాలను నడిపే డ్రైవర్లకు రూ.13 వేల నుంచి రూ.28వేలకు, ఎమర్జన్సీ మెడికల్ టెక్నీషిన్లకు రూ.15,500 నుంచి రూ.20వేలకు, 3 లక్షల మందికి పైగా శానిటేషన్ వర్కర్లకు, మున్సిపల్ వర్కర్ల అర్హతను పరిగణలోకి తీసుకుని రూ.8వేల నుంచి రూ.18 వేలకు వేతనాలు పెంపు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

అలాగే విలేజ్, వార్డ్ సెక్రటరియేట్‌లలో 1,35,000 మందికి ఉద్యోగాలు, 2,50,000 మందికి పైగా వలంటీర్ల నియామకం, వైద్య రంగంలో 53,126 మంది ఉద్యోగ సిబ్బంది నియామకం చేపట్టామని, 2లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని మంత్రి వెల్లడిం చారు. సమాజ నిర్మాణంలో 'ప్రభుత్వ ఉద్యోగులే కీలకం..వారికి సేవలందించకపోతే మనల్ని మనమే పేదరికంలో పడవేసుకున్నట్లు' అని జాన్ ఆఫ్ కెన్నడీ అనే ప్రఖ్యాత రాజకీయవేత్త చెప్పినట్లు దేశం మనకేమిచ్చింది అన్నదాని కన్నా దేశానికి మనమేం ఇచ్చాం అన్నదే ముఖ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓపీఎస్, ఎస్ పీఎస్ అమలుకు ఉన్న అవకాశాలపై నిజాయతీగా కసరత్తు చేసిందని, ఒకవేళ మొండిగా ఓపీఎస్ ను అమలు చేయడానికే ప్రభుత్వం నిర్ణయించుకుంటే... రాబోయే 10ఏళ్ల తర్వాత కాలంలో ఉద్యోగులకు జీతభత్యాలిచ్చే పరిస్థితి ఉండదన్నారు. తాత్కాలిక సంతృప్తి, సంబరం మా ప్రభుత్వ విధానం కాదని, ప్రపంచ దేశాలు, ఇతర రాష్ట్రాలు, అక్కడి ఉద్యోగులు, పెన్షన్ విధానాలు, ఆర్థిక పరిస్థితులపై బేరీజు వేసి భవిష్యత్ ను భావితరాలను దృష్టిలో పెట్టుకుని మధ్యేమార్గంగా ఈ విధానం తీసుకొచ్చామని మంత్రి వివరించారు. భారతదేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రూపొందించిన జీపీఎస్‌ను అమలు చేయడం ఖాయమని, దేశం, రాష్ట్రం బాగున్నప్పుడే మనం బాగుంటామంటూ మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు
రెండు నెలలు సమయం ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జలకు ఏఐవైఎఫ్, నిరుద్యోగ జేఏసీ విజ్ఞప్తి

విశాలాంధ్ర-విజయవాడ:
పోలీస్ ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధం కావడానికి రెండు నెలలు సమయం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రవిడ సురేష్, ఏపీ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ షేక్ సిద్దిక్‌లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం సజ్జలను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పోలీస్ శాఖలోని కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల నియామకానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) 28 నవంబర్ 2022న నోటిఫికేషన్ ఇచ్చిందని... చాలా తక్కువ సమయంలో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారని తెలిపారు. ఫలితాలు కూడా రెండు వారాలు లోపే విడుదల చేశారన్నారు. అయితే ప్రిలిమ్స్ పరీక్ష అయిపోయిన వెంటనే దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నా దాదాపు ఆరు నెలల వరకు నిర్వహించకుండా నిరుద్యోగులతో చెలగాటమాడి ఆరు నెలల తరువాత నిర్వహించిందన్నారు. ఇప్పుడు మాత్రం వెనువెంటనే కేవలం 19 రోజుల వ్యవధిలోనే అక్టోబర్ 14 , 15న మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారని చెప్పారు. దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు దేహదారుఢ్య పరీక్షల కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించారన్నారు. మెయిన్స్ పరీక్షకు సన్నద్ధం కావడానికి రెండు నెలలు గడువు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఫిజికల్ ఈవెంట్లలో, ఎత్తు కొలతల్లో తేడాలు వస్తున్నాయని పేర్కొన్నారు. గత నోటిఫికేషన్‌లో ఎత్తు సరిపోయిన వారిని ఇప్పుడు ఎత్తు తక్కువ అని వెనక్కి పంపిస్తున్నారని... వాటిని సరిచేసి గత నోటిఫికేషన్‌లో ఎత్తు సరిపోయిన వారికి మళ్లీ ఈవెంట్స్ నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించి కోర్టు కేసులను పరిష్కరించకుండా ఎస్ఐ ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించడం దారుణమన్నారు. కోర్టు మార్కులను కలిపితే వారికీ నష్టం జరుగుతుందని, కోర్టు కేసులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 20వేల పోలీస్ ఉద్యోగాలూ భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బుధవారం గుంటూరులో గుర్రం జాషువా పురస్కారం అందుకున్న అరసం రాష్ట్ర అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి



షూటింగ్‌లో మెరిసిన మహిళలు

- ఆసియాక్రీడల్లో సత్తా చాటుతున్న భారత క్రీడాకారులు
- ఒక్కరోజే రెండు స్వర్ణాలు సహా ఎనిమిది పతకాలు సొంతం

హాంగ్‌జౌ:
చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. బుధవారం ఒక్క రోజులోనే ఎనిమిది పతకాలను సాధించారు. ఇందులో షూటర్లే ఏడింటిని కైవసం చేసుకోవడం విశేషం. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ వ్యక్తిగత విభాగంలో సిఫ్ట్ కౌర్ సమ్రా పసిడి పతకం గెలుచుకుంది. మహిళల 25 మీటర్ల జట్టు విభాగంలో మను బాకర్, ఈషా సింగ్, రిథమ్ సంగ్వాన్ బృందం బంగారు పతకాన్ని సాధించింది. మహిళల 25 మీటర్ల పిస్తోల్ వ్యక్తిగత విభాగంలో ఈషా సింగ్ రజత పతకం కైవసం చేసుకుంది.

పురుషుల స్కీట్ షూటింగ్ వ్యక్తిగత విభాగంలో అనంత్‌జీత్ సింగ్ నరుక రజత పతకాన్ని సాధించగా... మహిళల 25 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ టీమ్ విభాగంలో ఆషి చౌక్సీ, మనిని కౌశిక్, సిఫ్ట్ కౌర్ సమ్రాతో కూడిన జట్టు రజతం సొంతం చేసుకుంది. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ వ్యక్తిగత విభాగంలో ఆషి చౌక్సీకి కాంస్య పతకం దక్కింది. మరొక పతకం సెయిలింగ్‌లో వచ్చింది. పురుషుల స్కీట్ షూటింగ్ జట్టు విభాగంలో అంగద్, గుర్జోత్, అనంత్‌జీత్ సింగ్ కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పురుషుల దింగే ఐఎల్‌సీఏ 7 విభాగంలో విష్ణు శరవణన్ కాంస్య పతకం దక్కించుకున్నాడు. దీంతో భారత్ క్రీడాకారులు సాధించిన మొత్తం పతకాల సంఖ్య 22కి చేరింది. ఇందులో ఐదు స్వర్ణాలు, ఏడు రజతాలు, 10 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ ఆరో స్థానంలో కొనసాగుతోంది. మొత్తంగా షూటింగ్‌లో మూడు బంగారు పతకాలు, నాలుగు రజత పతకాలు, ఐదు కాంస్య పతకాలను భారత షూటర్లు కైవసం చేసుకున్నారు. టేబుల్ టెన్నిస్, చెస్, స్క్వాష్, ఈక్వెస్ట్రియన్ ఈవెంట్లలో పతకాలు సాధించే దిశగా భారత క్రీడాకారులు సాగుతున్నారు. మరోవైపు ఆతిథ్య చైనా మొత్తం 131 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇందులో 72 స్వర్ణ పతకాలే ఉండటం విశేషం. చైనా తర్వాత కొరియా (మొత్తం 62 పతకాలు), జపాన్ (59), ఉజ్బెకిస్థాన్ (28), హాంకాంగ్ (26) ఉన్నాయి.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttunguta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.